


Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 187 | శనివారం 27 డిసెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## జలాంతర్గామిలో ప్రయాణించనున్న

# రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- 28న కర్ణాటకలోని కర్వార్ హార్బర్ నుంచి ప్రయాణించనున్న రాష్ట్రపతి
- రేపటి నుంచి నాలుగు రోజుల పాటు గోవా, ఝార్ఖండ్, కర్ణాటకలలో పర్యటించనున్న రాష్ట్రపతి
- జలాంతర్గామిలో ప్రయాణిస్తారని తెలిపిన రాష్ట్రపతి భవన్

2లో



## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు

# కాంగ్రెస్ నివాళి

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, డిసెంబర్ 26

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ తొలి వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయనకు కాంగ్రెస్ ఘనంగా నివాళలర్పించింది. పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతన నాయకులు న్యూఢిల్లీలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఖర్గే సోషల్ మీడియాలో చేసిన పోస్టులో దేశ ఆర్థిక మార్గాన్ని మన్మోహన్ పునర్మిర్మించారని, ఆర్థిక సంస్కరణల ద్వారా లక్షలాది మందికి అవకాశాలను విస్తరించారని, లక్షలాది మందిని పేదరికం నుంచి బయటపడేశారని

- మిగతా 2లో..





## ఢిల్లీ హైకోర్టులో

# పవన్‌కు ఊరట

- పవన్ కల్యాణ్ వ్యక్తిగత హక్కులకు ఢిల్లీ హైకోర్టు రక్షణ
- ఆయన పేరు, ఫొటో, వాయిస్‌ను వాణిజ్యపరంగా వాడొద్దని ఆదేశం
- ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి సంస్థలకు కీలక సూచనలు
- ఏఐ, డీప్‌ఫేక్‌ల ద్వారా కంటెంట్ సృష్టిపైనా ఆంక్షలు
- ఫ్యాన్ పేజీలకు మినహాయింపు... స్పష్టమైన డిస్‌క్లెయిమర్ తప్పనిసరి

2లో

## రౌడీయిజం చేస్తే

# రాష్ట్ర బహిష్కరణే

- సీఎం చంద్రబాబు స్ట్రిక్ట్ వార్నింగ్
- తిరుపతిలో నూతన జిల్లా పోలీసు కార్యాలయం ప్రారంభం
- హాజరైన సీఎం చంద్రబాబు
- రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- తిరుమల పవిత్రతను కాపాడాలని పోలీసులకు దిశానిర్దేశం
- టెక్నాలజీతో నేరాలను అదుపు చేయాలని పిలుపు



తిరుపతి- సూర్య వాస్తవం, డిసెంబర్ 26

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడటం, దేశ విదేశాల నుంచి తరలివచ్చే కోట్లాది మంది భక్తులకు పూర్తిస్థాయి భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని, రాజకీయ ముసుగులో రౌడీయిజం, అరాచకాలకు పాల్పడితే ఎంతటివారైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రాష్ట్రం నుంచి బహిష్కరిస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. శుక్రవారం తిరుపతిలో అత్యాధునిక వసతులతో నిర్మించిన నూతన జిల్లా పోలీసు కార్యాలయాన్ని (డీపీఓ) ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి

- మిగతా 2లో..



## స్పైడర్ మ్యాన్ కన్నా

# హనుమంతుడే బలవంతుడు

- ఆ సినిమా కంటే మన మహాభారతం, రామాయణం గొప్పవని పిల్లలకు చెప్పాలి: సీఎం చంద్రబాబు
- భారత్ త్వరలోనే సూపర్ పవర్ అవుతుంది
- స్పైడర్ మ్యాన్ కన్నా హనుమంతుడే బలవంతుడని పిల్లలకు చెప్పాలని సూచన
- దేశ సంస్కృతి పరిరక్షణకు మోహన్ భగవత్ కృషి అభినందనీయమని కితాబు
- 2047 నాటికి ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో నిలుస్తుందని ధీమా
- ఏపీలో క్వాంటం కంప్యూటర్, గ్రీన్ ఎనర్జీ రంగాలకు ప్రాధాన్యమిస్తున్నామని వెల్లడి

2లో

## ఢిల్లీకి బయలుదేరిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

- ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో రేపు ఉదయం సీడబ్ల్యూసీ కీలక సమావేశం
- మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం
- దేశంలోని రాజకీయ పరిస్థితులు సహా వివిధ అంశాలపై చర్చించనున్న సీడబ్ల్యూసీ

హైదరాబాద్- సూర్య వాస్తవం, డిసెంబర్ 26

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు సాయంత్రం దేశ రాజధాని ఢిల్లీకి పయనమయ్యారు. రేపు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# నీళ్లపై నిగ్గు తేలుద్దాం

- జిల్లాలు, ప్రాజెక్టుల వారీగా సిద్ధంకండి
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు సీఎం దిశా నిర్దేశం
- ఒకటిన ప్రజాభవన్‌లో మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్
- రెండున కృష్ణా జలాలు, మూడున గోదావరిలో వాటాలపై అసెంబ్లీలో చర్చ



హైదరాబాద్- సూర్య వాస్తవం, డిసెంబర్ 26

రాష్ట్రానికి సంబంధించిన నీటి వాటాలపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అవాస్తవాలు, అసత్యాలు ప్రచారం చేస్తోన్న నేపథ్యంలో ఈనెల 29 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఆ పార్టీపై ఎదురుదాడికి దిగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశా నిర్దేశం చేశారు. కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాలు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఒప్పందాలపై అంకెలు, సంఖ్యలు, గణాంకాలతో సిద్ధం కావాలని ఆయన ఆదేశించారు. ఈ ప్రిపరేషన్‌లో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు ఎంపీలకు కూడా పవర్ పాయింట్ ప్రజంటేషన్ (పీపీటీ) ఇప్పించాలని సీఎం నిర్ణయించారు. ఆ మేరకు అన్ని వివరాలను తెప్పించాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఆయన కోరారు. ప్రజా ప్రతినిధులకు అర్థమయ్యేలా

- మిగతా 2లో..



## వివాదాల పరిష్కారానికి

# మధ్యవర్తిత్వమే మేలు

- సీజేఐ సూర్యకాంత్
- ఇది ఖర్చు తక్కువతో కూడిన, ఇరుపక్షాలకూ ప్రయోజనకరమైన ప్రక్రియ అన్న సీజేఐ
- 'దేశం కోసం మధ్యవర్తిత్వం' కార్యక్రమాన్ని ప్రారంభించిన సుప్రీంకోర్టు
- కేసులు కోర్టుకు రాకముందే పరిష్కరించుకునే అవకాశం ఉందని వెల్లడి

పనాజీ- సూర్య వాస్తవం, డిసెంబర్ 26

వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం ఎంతో విజయవంతమైన, తక్కువ ఖర్చుతో కూడిన ప్రక్రియ అని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఇది కేసులోని ఇరుపక్షాలకూ గెలుపు-గెలుపు పరిస్థితిని

- మిగతా 2లో..

## జలాంతర్గామిలో ప్రయాణించనున్న
# రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**- 28న కర్ణాటకలోని కర్వార్ హార్బర్ నుంచి ప్రయాణించనున్న రాష్ట్రపతి**
**- రేపటి నుంచి నాలుగు రోజుల పాటు గోవా, ఝార్ఖండ్, కర్ణాటకలలో పర్యటించనున్న రాష్ట్రపతి**
**- జలాంతర్గామిలో ప్రయాణిస్తారని తెలిపిన రాష్ట్రపతి భవన్**

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, డిసెంబర్ 26**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జలాంతర్గామిలో ప్రయాణించను న్నారు. ఈ నెల 28న కర్ణాటకలోని కార్వాడ్ నౌకాశ్రయం నుంచి ఆమె ప్రయాణం సాగుతుందని రాష్ట్రపతి భవన్ వెల్లడించింది. శనివారం నుంచి నాలుగు రోజుల పాటు ఆమె గోవా, ఝార్ఖ ండ్, కర్ణాటక రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె జలాంతర్గామిలో ప్రయాణిస్తారని ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రపతి ముర్ము రెండు నెలల క్రితం రఫేల్ యుద్ధ విమానంలో గగన విహారం చేశారు. హర్యానాలోని అంబాలా వైమానిక స్థావరం నుంచి రఫేల్?లో ఆమె ప్రయాణించిన విషయం తెలిసిందే. అంతకుముందు 2023 మే 8న అసోంలోని తేజ్‌పూర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానంలో ఆమె విహరించారు.

సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానంలో విహరించిన రెండో మహిళా రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము నిలిచారు. అంతకుముందు, 2009లో ప్రతిభా పాటిల్ గగనయానం చేశారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కూడా 2006లో పుణే వాయుసేన స్థావరం నుంచి సుఖోయ్-30లో ప్రయాణించారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు
# కాంగ్రెస్ నివాళి

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. మన్మోహన్ వినయం, నిజాయితీ, వారసత్వం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని చెప్పారు. రాహుల్‌గాంధీ తన పోస్టులో 'మన్మోహన్ తన దార్శనిక నాయకత్వం ద్వారా భారత్‌ను ఆర్థికంగా శక్తివంతం చేశారు. ఆయన చారిత్రాత్మక ప్రయత్నాలు, పేదల కోసం తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలు ప్రపంచ వేదికపై భారత్‌కు కొత్త గుర్తింపును ఇచ్చాయి' అని తెలిపారు. ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా తన పోస్టులో 'మన్మోహన్ సింగ్ సమానత్వాన్ని బలంగా విశ్వసించారు. ఆయన ఒక బలమైన, ధైర్యవంతుడైన, గౌరవనీయమైన వ్యక్తి. దేశ ప్రగతికి నిజంగా అంకితమైనవారు.

# నీళ్లపై నిగ్గు తేలుద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సూటిగా, స్పష్టంగా, విడమరిచి చెప్పాలని ఆయన మంత్రికి విజ్ఞప్తి చేసినట్టు అధికార పార్టీ వర్గాలు తెలిపాయి. సీఎం సూచనల మేరకు కొత్త ఏడాది ప్రారంభం రోజైన జనవరి ఒకటిన హైదరాబాద్ బేగంపేటలోగల ప్రజా భవన్‌లో మంత్రి ఉత్తమ్ పీపీటీ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ప్రజాభవన్ అధికారులు తెలిపారు. పీపీటీకి విధిగా హాజరు కావాలంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఇప్పటికే ఆదేశాలు వెళ్లాయి. జనవరి ఒకటిన షరా మామూలుగా ఉండే పార్టీలు, వేడుకలకు వెళ్లాల్సి ఉంటుందని, అందువల్ల ఆ రోజు కాకుండా మరో రోజు పీపీటీ ఇవ్వాలంటూ పలువురు ప్రజా ప్రతినిధులు కోరినప్పటికీ సీఎం తిరస్కరించారని సమాచారం. అసెంబ్లీలో సీరియస్‌గా చర్చించాల్సిన అంశం కాబట్టి, జనవరి ఒకటిన ఎవ్వరికీ మినహాయింపునిచ్చేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేసినట్టు తెలిసింది. కాగా జనవరి 2న కృష్ణా జలాలపై, 3న గోదావరి జలాలపై శాసనసభలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఈ చర్చలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభిస్తారు. సీఎం రేవంత్ రెడ్డి చర్చలో పాల్గొంటూ అనేక విషయాలను సోదాహరణంగా వివరించనున్నారు. ఈ క్రమంలో అసెంబ్లీ హీటెక్కటం ఖాయంగా కనబడుతోంది. కాగా ఈనెల 29న శాసనసభ, మండలి శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఆ రోజు కార్యకలాపాల తర్వాత జనవరి ఒకటికి ఉభయ సభలు వాయిదా పడనున్నాయి.

## వివాదాల పరిష్కారానికి
# మధ్యవర్తిత్వమే మేలు

(మొదటి పేజీ తరువాయి)

కల్పిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం గోవాలోని పనాజీలో 'మధ్యవర్తిత్వంపై అవగాహన' కోసం ఏర్పాటు చేసిన పాదయాత్రలో పాల్గొన్న అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మధ్యవర్తిత్వ ప్రక్రియలో మధ్యవర్తి ఎవరిపైనా తమ నిర్ణయాలను రుద్దరని సీజేఐ స్పష్టం చేశారు. వివాదంలో ఉన్న పక్షాలు కోరుకున్న పరిష్కారాన్నే దీని ద్వారా సాధించవచ్చని తెలిపారు. ఇది ఇరువర్గాల అంగీకారంతో జరిగే పరిష్కారం కాబట్టి, ఇద్దరికీ ప్రయోజనకరంగా ఉం టుందని వివరించారు. సుప్రీంకోర్టు 'దేశం కోసం మధ్యవర్తిత్వం' అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందని జస్టిస్ సూర్యకాంత్ వెల్లడించారు. న్యాయవ్యవస్థలోని భాగస్వాములైన న్యాయవాదులు, న్యాయమూర్తులతో పాటు సాధారణ ప్రజలకు కూడా దీని ప్రాముఖ్యతను తెలియజేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం ఒక విజయవంతమైన సాధనమని ప్రజలు గుర్తించినప్పుడు మంచి ఫలితాలు వస్తాయని ఆయన అన్నారు. కొన్ని ప్రత్యేక కేసులను మధ్యవర్తిత్వానికి పంపమని హైకోర్టులను, జిల్లా కోర్టులను ఒప్పించగలిగామని తెలిపారు. ఇది పాత, కొత్త కేసులకే కాకుండా, కోర్టుకు రాకముందు దశలో (ప్రీ-లిటిగేషన్) ఉన్న వివాదాలకు కూడా వర్తిస్తుందని, ఇది నిరంతర ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు.

## ఢిల్లీకి బయలుదేరిన
## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి కూడా పాల్గొంటున్నారు. ఢిల్లీలో నూతనంగా నిర్మించిన ఏఐసీసీ కార్యాలయం ఇందిరా భవన్‌లో రేపు ఉదయం 10.30 గంటలకు అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం ప్రారంభం కానుంది. ఈ సమావేశంలో, దేశవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ పరిస్థితులు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు, రాబోయే ఎన్నికలు, పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నట్లు సమాచారం. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు.

## రౌడీయిజం చేస్తే
# రాష్ట్ర బహిష్కరణే



(మొదటి పేజీ తరువాయి)

వంగలపూడి అనితతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఆయన, నూతన కార్యాలయంలోని వసతులను పరిశీలించి, విజిటర్స్ పుస్తకంలో తన సందేశాన్ని రాశారు. కలియుగ వైకుంఠమైన తిరుమల క్షేత్రానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, ఇక్కడికి వచ్చే భక్తులలో భద్రతా భావాన్ని కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని అన్నారు. ముఖ్యంగా వైకుంఠ ఏకాదశి వంటి పర్వదినాల సమయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు.

నేరాల నియంత్రణలో ఆధునిక టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఉంచి,వి కీలక ఆధారాలను సేకరించాలని, నేరస్తుల ఆలోచనల కన్నా ఓ అడుగు ముందుండాలని పిలుపునిచ్చారు. 'విజిబుల్ పోలీసింగ్, ఇన్విజిబుల్ పోలీస్' అనే విధానాన్ని అనుసరించి, ప్రజలకు భరోసా ఇస్తూనే నేరగాళ్ల కదలికలను పసిగట్టాలని స్పష్టం చేశారు.

**గత పాలనపై తీవ్ర విమర్శలు**

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా గాడి తప్పాయని చంద్రబాబు విమర్శించారు. కొందరు రాజకీయ అండతో చెలరేగిపోయారని, సమాజంలో భయాన్ని సృష్టించే సంస్కృతిని ప్రోత్సహించారని ఆరోపించారు. "రోడ్లు బ్లాక్ చేయడం, కత్తులతో జంతువులను బలిచ్చి ఆ రక్తంతో పోస్టర్లు నింపడం వంటి భయానక వాతావరణాన్ని సృష్టించారు. బంగారుపాళ్యంలో మామిడి కాయలు తొక్కించడం, గుంటూరులో ఒక వ్యక్తిని కాన్వాయ్ కింద తొక్కించి పొదల్లో పడేసి, తర్వాత అంబులెన్స్‌లో తీసుకెళ్లి చంపేయడం వంటి అమానవీయ ఘటనలు చూశాం. ఇలాంటివి పునరావృతం కాకుండా సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా ఆధారాలు పక్కాగా సేకరించాలి" అని పోలీసులకు సూచించారు.

**అక్రమార్కులపై కఠిన వైఖరి**

అక్రమాలకు పాల్పడితే సొంత పార్టీ నాయకులనైనా జైలుకు పంపిన చరిత్ర తమదని గుర్తుచేశారు. సెటిల్‌మెంట్లు, బెదిరింపులకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. సోషల్ మీడియా వేదికగా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ, అసభ్యకరమైన పోస్టులు పెట్టేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నేతలు ఎవరూ ఇలాంటి చర్యలకు పాల్పడటం లేదని, కేవలం కొందరు రాజకీయ లబ్ధి కోసమే ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని విమర్శించారు.

ఇదే సమయంలో, తిరుపతి జిల్లాలో గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం స్మగ్లింగ్‌ను సమర్థవంతంగా అరికడుతున్న పోలీసు సిబ్బందిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. పీడీ యాక్టులను ప్రయోగించి నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్న తీరును కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.








# ఢిల్లీ హైకోర్టులో పవన్‌కు ఊరట

- పవన్ కల్యాణ్ వ్యక్తిగత హక్కులకు ఢిల్లీ హైకోర్టు రక్షణ
- ఆయన పేరు, ఫొటో, వాయిస్‌ను వాణిజ్యపరంగా వాడొద్దని ఆదేశం
- ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి సంస్థలకు కీలక సూచనలు
- ఏఐ, డీప్‌ఫేక్‌ల ద్వారా కంటెంట్ సృష్టిపైనా ఆంక్షలు
- ఫ్యాన్ పేజీలకు మినహాయింపు... స్పష్టమైన డిస్‌క్లెయిమర్ తప్పనిసరి

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, డిసెంబర్ 26**

టాలీవుడ్ పవర్ స్టార్, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన పేరు, చిత్రం, గొంతు, వ్యక్తిగత గుర్తింపులను ఎలాంటి అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయకుండా పలు ఆన్‌లైన్ సంస్థలు, ఏఐ ప్లాట్‌ఫారమ్‌లు, వెబ్‌సైట్లపై మధ్యంతర ఉత్తర్వులు (యాడ్-ఇంటరిమ్ ఇంజంక్షన్) జారీ చేసింది. తన వ్యక్తిగత, ప్రచార హక్కులకు (పర్సనాలిటీ అండ్ పబ్లిసిటీ రైట్స్) భంగం కలుగుతోందని ఆరోపిస్తూ పవన్ కల్యాణ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరాతో కూడిన ఏకసభ్య ధర్మాసనం ఈ ఎక్స్‌పార్టీ ఆదేశాలు ఇచ్చింది.

మూడు దశాబ్దాలుగా సినీ, రాజకీయ రంగాల్లో ఉన్న పవన్ కల్యాణ్‌కు గణనీయమైన వాణిజ్య బ్రాండ్ విలువ ఉందని, ఆయన వ్యక్తిగత హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. పలు సంస్థలు పవన్ కల్యాణ్ అనుమతి లేకుండా ఆయన ఫొటోలతో టీ-షర్టులు, కప్పులు, పోస్టర్లు వంటివి అమ్ముతున్నాయని, ఏఐ టూల్స్ ద్వారా ఆయన గొంతు, ఫొటోలను వాడుతున్నారని, సోషల్ మీడియాలో ఫేక్ పేజీలు నిర్వహిస్తున్నారని పవన్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల పవన్‌కు పూడ్చలేని నష్టం వాటిల్లుతుందని ధర్మాసనం పేర్కొంది.

ఈ నేపథ్యంలో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మీషో వంటి ఈ-కామర్స్ వేదికల నుంచి అలాంటి ఉత్పత్తులను తక్షణమే తొలగించాలని ఆదేశించింది. వాటిని అమ్ముతున్న విక్రయదారుల కేవైసీ వివరాలను పిటిషనర్‌కు అందించాలని సూచించింది. పవన్ పేరును దుర్వినియోగం చేస్తున్న వెబ్‌సైట్ లింకులను వారం రోజుల్లోగా తొలగించాలని స్పష్టం చేసింది. అయితే, ఫ్యాన్ పేజీలకు మాత్రం కొన్ని షరతులతో మినహాయింపు ఇచ్చింది. అవి 'ఫ్యాన్ పేజీ' అని స్పష్టమైన డిస్‌క్లెయిమర్ ఇవ్వాలని, లేనిపక్షంలో వాటిని కూడా నిలిపివేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 9వ తేదీకి వాయిదా వేసింది.

## స్పైడర్ మ్యాన్ కన్నా
# హనుమంతుడే బలవంతుడు

- ఆ సినిమా కంటే మన మహాభారతం, రామాయణం గొప్పవని పిల్లలకు చెప్పాలి: సీఎం చంద్రబాబు
- భారత్ త్వరలోనే సూపర్ పవర్ అవుతుంది
- స్పైడర్ మ్యాన్ కన్నా హనుమంతుడే బలవంతుడని పిల్లలకు చెప్పాలని సూచన
- దేశ సంస్కృతి పరిరక్షణకు మోహన్ భగవత్ కృషి అభినందనీయమని కితాబు
- 2047 నాటికి ప్రపంచంలోనే భారత్ గ్రస్థానంలో నిలుస్తుందని ధీమా
- ఏపీలో క్వాంటం కంప్యూటర్, గ్రీన్ ఎనర్జీ రంగాలకు ప్రాధాన్యమిస్తున్నామని వెల్లడి

**తిరుపతి- సూర్య వాస్తవం, డిసెంబర్ 26**

స్పైడర్ మ్యాన్, ఐరన్ మ్యాన్ వంటి కాల్పనిక పాత్రల కన్నా హనుమంతుడు, అర్జునుడు వంటి మన పురాణ పురుషులే గొప్పవారని పిల్లలకు చెప్పాల్సిన బాధ్యత మనపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అవతార్ సినిమా కంటే మన మహాభారతం, రామాయణం చాలా గొప్పవని పిల్లలకు చెప్పాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో నిలుస్తుందని, సూపర్ పవర్‌గా అవతరించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన 'భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్' ప్రారంభ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "వేల ఏళ్ల క్రితమే హరప్పా నాగరికత ద్వారా అర్బన్ ప్లానింగ్‌ను ప్రపంచానికి పరిచయం చేశామని, యోగా, ఆయుర్వేదం వంటి శాస్త్రాలను అందించామని గుర్తుచేశారు. తక్షశిల, నలంద వంటి విశ్వవిద్యాలయాలతో పాటు, సున్నాను, చదరంగాన్ని కనిపెట్టిన ఘనత మనదే. ఆర్యభట్ట, భాస్కరాచార్య, కౌటిల్యుడు వంటి మహానుభావులు మనకు స్ఫూర్తి" అని అన్నారు. రెండు వేల ఏళ్ల క్రితమే ప్రపంచ జీడీపీలో 40 శాతం వాటాతో భారత్ నాలెడ్జ్ ఎకానమీలో సూపర్ పవర్‌గా ఉండేదని, విదేశీ పాలన, కొన్ని విధానాల వల్ల వెనుకబడ్డామని తెలిపారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ, దేశాభివృద్ధికి ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ చేస్తున్న కృషి శ్లాఘనీయమని కొనియాడారు. "తిరుగులేని యువశక్తి మన దేశం సొంతం. ఇదే మనల్ని అగ్రస్థానంలో నిలుపుతుంది. దేశాభివృద్ధికి వాజ్‌పేయి పునాదులు వేస్తే, ప్రధాని నరేంద్ర మోదీ అద్భుతంగా ముందుకు తీసుకెళు తున్నారు" అని చంద్రబాబు పేర్కొన్నారు. మన కుటుంబ వ్యవస్థ గొప్పదని, పిల్లలకు మన పురాణాల గురించి వివరించాలని సూచించారు.

రాష్ట్ర అభివృద్ధికి చేపడుతున్న ప్రణాళికలను కూడా చంద్రబాబు వివరించారు. ఏపీలో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, త్వరలోనే రాష్ట్రం నుంచి క్వాంటం కంప్యూటర్ ఆపరేట్ చేయబోతున్నామని తెలిపారు. విశాఖలో గూగుల్ వంటి సంస్థలు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టబోతున్నాయని వెల్లడించారు. సదస్సు ప్రారంభానికి ముందు చంద్రబాబు, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్‌తో కలిసి ప్రాంగణంలోని స్టాళ్లను సందర్శించారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన పలు పరికరాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, మంత్రి అనగాని సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఇండియాస్ నాలెడ్జ్ సిస్టమ్స్' అనే పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

# సంపాదకీయం

## ఓ వైపు బంగ్లాదేశ్..
## మరో వైపు పాకిస్తాన్

బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రెహమాన్ పాకిస్తాన్ విషయంలో చాలా కఠినంగా ఉండేవారు.బంగ్లాదేశ్‌ను గుర్తించకపోవడంతో పాకిస్తాన్ అధ్యక్షుడు జుల్ఫికార్ అలీ భుట్టోతో మాట్లాడేందుకు షేక్ ముజిబుర్ రెహమాన్ నిరాకరించారు.పాకిస్తాన్ మొదట బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని తిరస్కరించింది.తర్వాతి రోజుల్లో పాకిస్తాన్ వైఖరి మారింది.1974 ఫిబ్రవరిలో ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కాన్ఫరెన్స్ సమ్మిట్ లాహోర్‌లో జరిగింది.జుల్ఫికార్ అలీ భుట్టో అప్పుడు ప్రధానమంత్రిగా ఉన్నారు.ముజిబుర్ రెహమాన్‌కు అధికారిక ఆహ్వానాన్ని పంపించారు. ముజిబ్ మొదట హాజరు కావడానికి నిరాకరించినా తరువాత అంగీకరించారు.పాకిస్తాన్ 1974 ఫిబ్రవరి 22న బంగ్లాదేశ్‌ను గుర్తించింది. భుట్టో ఈ గుర్తింపును 'ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కాన్ఫరెన్స్'లో ప్రకటించారు."అల్లా కోసం మా దేశ పౌరుల తరఫున మేం బంగ్లాదేశ్‌ను దేశంగా గుర్తిస్తున్నాం. రేపు ఒక ప్రతినిధి బృందం వస్తుంది. 7 కోట్ల మంది ముస్లింల తరఫున మేం వారిని ఆలింగనం చేసుకుంటాం" అని జుల్ఫికార్ అలీ భుట్టో అన్నారు.అయినప్పటికీ రెండు దేశాల మధ్య సంబంధాలు పూర్తిస్థాయిలో దారినపడలేదు.కానీ, ఇప్పుడు సుమారు 52 ఏళ్ల తరువాత రెండు దేశాల మధ్య పరిస్థితులు మారుతున్నట్లు కనిపిస్తున్నాయి.షేక్ హసీనా అధికారం కోల్పోయిన తర్వాత బంగ్లాదేశ్, పాకిస్తాన్ మధ్య చారిత్రక దూరం తగ్గుతున్నట్లు కనిపిస్తోంది.బంగ్లాదేశ్‌లో ఇంక్విలాబ్ మంచ్ నాయకుడు ఉస్మాన్ హాదీ డిసెంబర్ 18న మరణించారు.డిసెంబర్ 12న ఢాకాలో గుర్తు తెలియని దుండగులు ఆయనపై కాల్పులు జరిపారు.గతవారం.. బంగ్లాదేశ్‌లో ఫ్యాక్టరీ కార్మికుడైన హిందూ యువకుడిని ఒక గుంపు కొట్టి చంపింది.ఈ సంఘటన తర్వాత భారత్- బంగ్లాదేశ్ సంబంధాల్లో ఉద్రిక్తత పెరిగింది. ఆ తర్వాతి పరిణామాలతో రెండు దేశాల మధ్య వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు.డిసెంబర్ 20న, పాకిస్తాన్ జమాత్ ఏ ఇస్లామీ మాజీ అధ్యక్షుడు అమీర్ సిరాజ్-ఉల్ హక్ బంగ్లాదేశ్ యువతను ప్రశంసిస్తూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు."బంగ్లాదేశ్‌లోని విద్యావంతులు, ధైర్యవంతులైన యువత అఖండ భారత్ అనే ఆలోచనను ధ్వంసం చేసింది. భారత్ ఈ ప్రాంతంలో అస్థిరతను సృష్టిస్తోంది. కెనడా, పాకిస్తాన్ తర్వాత బంగ్లాదేశ్‌లో భారత్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, హత్యలు చేస్తోందనే ఆరోపణలు వచ్చాయి" అని ఆయన అందులో రాశారు.ఉస్మాన్ హాదీ హంతకులు భారత్‌లో తలదాచుకున్నారని బంగ్లాదేశ్‌లోని సోషల్ మీడియాలో వదంతులు వ్యాపించాయి.అయితే దీనిపై బంగ్లాదేశ్ పోలీసులు కానీ, ప్రభుత్వం కానీ అధికారికంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.రెండు దేశాల్లోనూ సామాజిక మాధ్యమాల్లో విస్తరిస్తున్న వదంతులు భారత్- బంగ్లా మధ్య దౌత్య సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయి.బంగ్లాదేశ్‌లోని భారత్ దౌత్య కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి.హిందూ యువకుడి హత్యను నిరసిస్తూ దిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం ఎదుట ఆందోళన జరిగింది.భారత్‌కు వ్యతిరేకంగా బంగ్లాదేశ్ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై భారత విదేశీ వ్యవహారాల శాఖ డిసెంబర్ 17న స్పందించింది"బంగ్లాదేశ్‌లో ఇటీవలి కొన్ని సంఘటనలకు సంబంధించి ఛాందసవాద శక్తులు చేసిన తప్పుడు వాదనలను మేం తిరస్కరిస్తున్నాం. అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ఈ సంఘటనలపై సమగ్ర దర్యాప్తు చేపట్టకపోవడం లేదా భారతదేశంతో ఎలాంటి నిర్దిష్ట ఆధారాలను పంచుకోకపోవడం దురదృష్టకరం" అని తన ప్రకటనలో పేర్కొంది.గతేడాది ఆగస్టులో షేక్ హసీనా బంగ్లాదేశ్ నుంచి పారిపోయి భారత్ వచ్చినప్పటి నుంచి పాక్-బంగ్లాదేశ్ సంబంధాలు మెరుగవడం మొదలైంది.పాక్- బంగ్లాదేశ్ మధ్య దూరం నిరంతరం తగ్గుతున్నట్లు కనిపించే అనేక సంఘటనలు జరిగాయి.1971లో బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం తర్వాత నిరుడు నవంబర్‌లో పాక్- బంగ్లా మధ్య తొలిసారి నేరుగా సముద్ర వాణిజ్యం జరిగింది.గతంలో రెండు దేశాల మధ్య సముద్ర వాణిజ్యం సింగపూర్ లేదా కొలంబో ద్వారా జరిగేది."పాకిస్తాన్‌లోని కరాచీ నుంచి బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ ఓడరేవుకు నేరుగా కార్గో నౌక చేరుకోవడం ఇదే తొలిసారి.

ద్వైపాక్షిక సంబంధాల్లో ఇది కీలకమైన ముందడుగు" అని బంగ్లాదేశ్‌లోని పాకిస్తాన్ హై కమిషన్ ఒక ప్రకటనలో పేర్కొంది.బంగ్లాదేశ్‌లోని పాకిస్తాన్ హైకమిషనర్ సయ్యద్ అహ్మద్ మరూఫ్ నిరుడు నవంబర్ 6న "పాకిస్తాన్‌లోని బంగ్లాదేశ్ పౌరులకు ఉచితంగా వీసాలు ఇస్తాం. వారి వీసా దరఖాస్తులపై 48 గంటల్లోపు నిర్ణయం తీసుకుంటాం. వారు చేయాల్సిందల్లా వెబ్‌సైట్‌లో సమాచారాన్ని అందించడమే. వీసాలలో వ్యాపార, పర్యటక వీసాలున్నాయి. టూరిస్టు వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారు రిటర్న్ టికెట్, వసతి గురించి సమాచారం అందిస్తే చాలు" అని చెప్పారు.షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిన తర్వాత బంగ్లాదేశ్ జమాత్ ఏ ఇస్లామీ కీలకమైన రాజకీయ శక్తిగా ఎదుగుతున్నట్లు కనిపిస్తోంది.పాకిస్తాన్ జమాత్ ఏ ఇస్లామీ, బంగ్లాదేశ్ జమాత్ ఏ ఇస్లామీ మధ్య సైద్ధాంతిక సారూప్యత ఉంది. బంగ్లా విముక్తి యుద్ధంలో భారత్ పాత్రను జమాత్ ఏ ఇస్లామీ ప్రశ్నిస్తోంది.షేక్ హసీనా నిష్క్రమణ తర్వాత ఢాకాలోని బంగ్లాదేశ్ విముక్తి యుద్ధానికి చెందిన చారిత్రక వారసత్వంపై దాడులు, విధ్వంసం జరిగాయి.బంగ్లాదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ ముజిబుర్ రెహమాన్ ఇంటిపై దాడి జరిగింది.ముహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వానికి బంగ్లాదేశ్ జమాత్ ఏ ఇస్లామీ మద్దతు ఇస్తోంది."1971లో మా వైఖరి సూత్రప్రాయంగా ఉంది. భారత్ ప్రయోజనాల కోసం మేం స్వాతంత్ర్యం కోరుకోలేదు. పాకిస్తాన్ మాకు ఓటుహక్కు కల్పించాలని కోరుకున్నాం. అలా జరిగి ఉండకపోతే చాలా దేశాల మాదిరే గెరిల్లా యుద్ధంతో స్వాతంత్ర్యం సిద్ధించేది" అని 2025 ఫిబ్రవరిలో బంగ్లాదేశ్ వార్తా వెబ్‌సైట్ ప్రథమ్ అలోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బంగ్లాదేశ్ జమాత్ ఏ ఇస్లామీ చీఫ్ షఫీకుర్ రెహమాన్ చెప్పారు."మనం ఎవరి ద్వారా అయినా స్వాతంత్ర్యం పొందితే, లేదంటే ఎవరి తరఫునైనా స్వాతంత్ర్యం పొందితే అది ఒక భారాన్ని వదిలించుకుంటూ మరో భారాన్ని మోయడం ప్రారంభించినట్లవుతుంది. 53 ఏళ్లుగా బంగ్లాదేశ్ విషయంలో ఇది నిజం కాదా? ఒక పార్టీని ఇష్టపడని దేశం మాట మేమెందుకు వినాలి? ఆ దేశం కోరుకోక పోతే మేం అధికారంలోకి రాకూడదా? ఒక స్వతంత్ర దేశంలో ఇలాంటి పరిస్థితి ఉండాలా? ఇదంతా వినడానికి ఇకపై బంగ్లాదేశ్ యువత ఏ మాత్రం సిద్ధంగా లేదు" అని ఆయన అన్నారు.బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిస్థితుల వల్ల భారత్‌కు ముప్పు పెరగవచ్చని ఆయన అన్నారు. 54 ఏళ్ల వాజీద్ అమెరికాలో నివసిస్తున్నారు."ఇది భారతదేశానికి తీవ్ర ఆందోళన కలిగించే విషయం. అవామీ లీగ్ ప్రభుత్వం భారతదేశ తూర్పు సరిహద్దులను అన్ని ఉగ్రవాద కార్యకలాపాల నుంచి సురక్షితంగా ఉంచింది.బంగ్లాదేశ్‌తో వేగంగా క్షీణిస్తున్న సంబంధాలు భారతదేశానికి మూడు వైపులా సవాలును విసురుతున్నాయి. 4వేల కిలోమీటర్ల పొడవైన సరిహద్దులో చొరబాటు ముప్పు పెరుగుతుంది. భారత వ్యతిరేక శక్తులు సరిహద్దు వెంబడి స్థావరాలను ఏర్పాటు చేసుకునే ప్రమాదం ఉంది" అని జాకబ్ రాశారు.భారతదేశం, బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్తతలను పాకిస్తాన్, చైనా ఆసరాగా చేసుకుంటున్నాయి. బంగ్లాదేశ్‌లో పాకిస్తాన్ జోక్యం పెరిగింది. ఈ ఏడాది జూన్‌లో చైనాలోని కున్మింగ్‌లో చైనా ఉప విదేశాంగ మంత్రి సున్ వీడాంగ్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ విదేశాంగ కార్యదర్శుల మధ్య జరిగిన త్రైపాక్షిక సమావేశం భారతదేశానికి ఆందోళనకర సూచన. దీని తర్వాత 2024 చివరిలో పాకిస్తాన్ నేవీకి చెందిన నౌక చిట్టగాంగ్ పోర్టుకు వచ్చింది. ముహమ్మద్ యూనస్ ప్రభుత్వం చైనాతో తన బంధాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది" అని ఆయన తన కథనంలో రాశారు."ఏ కోణం నుంచి చూసినా, ప్రస్తుత పరిస్థితి భారతదేశానికి ఉపయోగకరంగా లేదు. ఈ ఉద్రిక్తత బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలను మరింత దెబ్బతీస్తుంది. భారతదేశంతో పేలవమైన సంబంధాలు బంగ్లాదేశ్‌కు మరింత హాని కలిగిస్తాయని భావించడం తప్పుడు అంచనా కావచ్చు" హేపీమోన్ జాకబ్ రాశారు.షేక్ హసీనా 2024 ఆగస్టు నుంచి భారతదేశంలో నివసిస్తున్నారు. హసీనాకు బంగ్లాదేశ్‌లో మరణశిక్ష విధించారు.షేక్ హసీనాను అప్పగించాలని భారతదేశాన్ని బంగ్లాదేశ్‌లోని మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం కోరుతోంది.కానీ భారత ప్రభుత్వం ఈ డిమాండ్‌ను అంగీకరించలేదు. దీనిపై బంగ్లాదేశ్ ప్రభుత్వం పదేపదే తన అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది.

# రచ్చకెక్కుతున్న టిక్కెట్ రేసు



**విజయవాడ - సూర్య వాస్తవం**

ఏపీలో ఎన్నికలకు ఇంకా మూడేళ్ల టైముంది. కానీ ఇప్పటినుంచే కొన్ని నియోజకవర్గాల్లో టికెట్ రేసు రచ్చకెక్కుతోంది. మరీ ముఖ్యంగా టీడీపీలో టికెట్ ఫైట్ మామూలుగా లేదు. గత ఎన్నికల్లోనే దాదాపు 50 మంది నేతలు టికెట్ త్యాగం చేయాల్సి వచ్చింది. ఇందులో 20 మంది వరకు సీనియర్ లీడర్లు పార్టీ గెలుపు కోసం..పొత్తుల్లో సీటును వదులుకోవాల్సి వచ్చింది.మరికొన్ని చోట్ల యువనేతలకు నామినేటెడ్ పోస్టుల హామీ ఇచ్చి టికెట్ రేస్ నుంచి తప్పించారు. ఇంకొందరు వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరుగుతుందని..అప్పుడు కచ్చితంగా టికెట్ ఇస్తామని హామీ ఇచ్చారు. కట్ చేస్తే అసెంబ్లీ సీట్ల పెంపుపైన స్పష్టత వచ్చింది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏపీలో 50, తెలంగాణలో 34 అసెంబ్లీ సీట్లు పెరగాల్సి ఉంది. ఒక్కో పార్లమెంట్ స్థానం పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లు పెరగాలి. కానీ 2029 ఎన్నికల్లోపే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన పూర్తి కాదని కేంద్రం క్లారిటీ ఇచ్చింది.అయితే 2026లో జనగణన చేపడుతుంటంతో ఇప్పుడు అసెంబ్లీ స్థానాల పెంపు చేయకుండా..సెన్సెస్ పూర్తయిన తర్వాత డీలిమిటేషన్ చేయాలని డిసైడ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో వచ్చే అసెంబ్లీ, లోక్సభ ఎన్నికలు పాత నియోజకవర్గాలతోనే జరుగనున్నాయి. 2029 ఎన్నికల నాటికి అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని ఆశపడ్డ పార్టీలకు, రాజకీయ నేతలకు బిగ్ షాక్ ఇచ్చినట్లు అయింది. 2024లో కూటమిలో భాగస్వామి అయిన టీడీపీ తమ నేతలకు సీట్లు సర్దుబాటు చేసేందుకు నానా అవస్థలు పడింది.గత ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు చేసేందుకు చివరి క్షణం వరకు బుజ్జగింపులు, సామాజిక సమీకరణాలు, పార్టీలో సీనియర్లకు హామీలు చాలా ప్రాసెస్ నడిచింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యత్వాలు, నామినేటెడ్ పోస్టులతో పాటు పార్టీ పదవుల పంపకం కూడా టీడీపీ హైకమాండ్‌కు ఇబ్బందికరంగా మారింది.టీడీపీకి పట్టు ఉండి..లీడర్ స్ట్రాంగ్‌గా ఉన్న చోటే జనసేన, బీజేపీ టికెట్ కోసం పట్టుబట్టడంతో..చాలా మంది తెలుగు తమ్ముళ్లు సీటు త్యాగం చేశాయి. అధికారంలోకి వస్తే ఏదో పదవి దక్కుతుందని ఆశపడి..ఇప్పటికి ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లోపు అసెంబ్లీ సీట్ల పెంపు అయ్యే పని కాదన్న క్లారిటీ వచ్చింది.టీడీపీ హైకమాండ్‌కు ఇప్పటినుంచే గుబులు మొదలైందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికలప్పుడే.. గెలుస్తున్నాం.. అధికారంలోకి వచ్చాక అన్ని విధాలుగా మిమ్మల్ని స్యాటిస్ఫై చేస్తామని కింద మీద పడి హామీ ఒప్పించి టికెట్ త్యాగానికి ఒప్పించారు. ఈ సారి టికెట్ల కేటాయింపు ఎలా.? అసలే ఐదేళ్లు పవర్‌లో ఉంటాం. పైగా అసంతృప్తులు, లీడర్ల వర్గపోరు ఉండనే ఉంది. వచ్చే ఎన్నికల్లో టికెట్ల కేటాయింపునకు ఇవన్నీ అడ్డంకిగా మారనున్నాయి. ఏం చేసేదని ఇప్పటినుంచే ఆలోచనలో పడిందట టీడీపీ అధిష్టానం.చాలాచోట్ల కూటమిలో వర్గపోరు నడుస్తోంది. స్టార్టింగ్లో కాస్త రచ్చకెక్కిన లీడర్లు..అధినేతల ఆదేశాలతో.. సర్దుకోకపోయినా..గొడవ అయితే పడట్లేదు. కలిసి పనిచేయడం కూడా అంతంత మాత్రమే. ఇలాంటి పరిస్థితులున్న వేళ..అసెంబ్లీ ఎన్నికల టికెట్ రేసు..ఇప్పటినుంచే కొన్ని నియోజకవర్గాల్లో కాక రేపుతోంది. అక్కడక్కడ తెలుగు తమ్ముళ్లే తగువ పడుతుంటే..మరికొన్ని చోట్ల, జనసేన, బీజేపీ నేతలతో టీడీపీ నేతలకు టికెట్ ఫైట్ నడుస్తోంది. ఎన్నికల టైమ్ వచ్చే సరికి టికెట్ రేసు, ఆశావహుల ప్రయత్నాలు జోరందుకోవడం ఖాయం. ఇప్పటినుంచే ప్రత్యామ్నాయం ఆలోచించడం.. సాధ్యమైనంత వరకు లీడర్లకు టికెట్‌పై క్లారిటీ ఇవ్వడం వంటివి టీడీపీ అధిష్టానం మదిలో ఉన్న అస్త్రాలుగా చెబుతున్నారు. గత ఎన్నికల్లో టికెట్ దక్కని వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వడంతో పాటు..కొందరిని పార్టీ పొలిట్ బ్యూరోలోకి.. మరికొందరిని జిల్లా పార్టీ అధ్యక్ష పగ్గాలు..ఇంకొందర్ని ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులుగా పంపించాలనేది బాబు ఆలోచనగా చెబుతున్నారు. సీట్ల సర్దుబాటు విషయంలో వచ్చే సవాళ్లను టీడీపీ అధిష్టానం ఇంకా ఎలా ఫేస్ చేయబోతోందో వేచి చూడాలి మరి.

# మేకపాటి స్థానంలో కొత్త నేత



**నెల్లూరు - సూర్య వాస్తవం**

జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా చాలా కుటుంబాలు అండగా నిలిచాయి. ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గం నేతలు తమ సొంత పార్టీలను వదిలి జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు. కానీ ఆ పార్టీలో అనుకున్న స్థాయిలో గుర్తింపు సాధించుకోలేకపోయారు. దీంతో ఒక్కొక్కరు బయటకు వెళ్ళిపోయారు. ఇప్పుడు మరో పొలిటికల్ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. అటు జగన్మోహన్ రెడ్డి సైతం ఆ ఫ్యామిలీని లైట్ తీసుకోవడంతో ఇక పార్టీలో ఉండడం భావ్యం కాదని భావిస్తున్నట్లు సమాచారం. వారి స్థానంలో ప్రత్యామ్నాయ నేతను బరిలోదించేందుకు అప్పుడే అన్వేషణ ప్రారంభించారట జగన్మోహన్ రెడ్డి. దీంతో ఆ ఫ్యామిలీ వ్యాపార కార్యకలాపాలకు పరిమితమైంది. ఎన్నికల ముంగిట ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని చూస్తోంది.కాంగ్రెస్ పార్టీని విభేదించి జగన్మోహన్ రెడ్డి సొంతంగా పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమయంలోనే నెల్లూరు జిల్లాకు చెందిన మేకపాటి ఫ్యామిలీ చేరింది. మేకపాటి రాజమోహన్ రెడ్డి సీనియర్ పొలిటీషియన్. 1989 నుంచి ఆయన ఎంపీ గానే పోటీ చేస్తూ గెలుస్తూ వచ్చారు. జగన్మోహన్ రెడ్డి తో పాటు ఎంపీ పదవిని వదులుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. 2012 ఉప ఎన్నికల్లో గెలిచారు కూడా. 2014 ఎన్నికల్లో సైతం ఆయనే సత్తా చాటారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి. అయితే 2019 ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల నుంచి పక్కకు తప్పుకున్నారు. ఆయన బదులు కుమారుడు గౌతమ్ రెడ్డి రంగంలోకి వచ్చారు. జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహిత నేత గౌతమ్ రెడ్డి. ఆయన వల్లే ఆ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరింది. 2019 ఎన్నికల్లో గౌతంరెడ్డి అసెంబ్లీకి పోటీ చేసి గెలిచారు. జగన్మోహన్ రెడ్డి మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. అయితే 2022లో చనిపోయారు గౌతమ్ రెడ్డి. ఆయన స్థానంలో తమ్ముడు విక్రమ్ రెడ్డి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ జగన్ మంత్రిగా అవకాశం ఇవ్వలేదు. అప్పటినుంచి మేకపాటి ఫ్యామిలీలో ఒక రకమైన అసంతృప్తి ఉన్నట్లు తెలుస్తోంది.గత ఎన్నికలకు ముందు మేకపాటి రాజమోహన్ రెడ్డి సోదరుడు చంద్రశేఖర్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. దీంతో మేకపాటి రాజమోహన్ రెడ్డి తో పాటు ఆయన కుమారుడు విక్రమ్ రెడ్డికి టికెట్ ఇచ్చారు జగన్. అయితే నెల్లూరు జిల్లాలో నేతలంతా బయటకు వెళ్లిపోవడంతోనే జగన్ మేకపాటి ఫ్యామిలీకి రెండో టిక్కెట్ కల్పించారు. కానీ 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రాజమోహన్ రెడ్డి కి ప్రాధాన్యత తగ్గించారు జగన్మోహన్ రెడ్డి. ఈ నేపథ్యంలో వ్యాపారాలు పై దృష్టి పెట్టింది మేకపాటి ఫ్యామిలీ. ఇటీవల నెల్లూరు వచ్చిన రాజమోహన్ రెడ్డి పార్టీ అధినేత తీరు మార్చుకోవాలని సూచిస్తూ విలువైన సలహాలు ఇచ్చారు. అయితే దీనిని సానుకూలంగా తీసుకోకుండా ప్రతికూలంగా తీసుకున్నట్లు తెలుస్తోంది జగన్మోహన్ రెడ్డి. అందుకే ఆయన స్థానంలో టిడిపిలో ఉన్న ఒక బడా నేతను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం టిడిపిలో ఎంపీగా ఉన్న ఓ నేతను నెల్లూరుకు రప్పించి ఎంపీగా పోటీ చేయించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. అతని కుమారుడికి అసెంబ్లీ టికెట్ ఇస్తానని కూడా ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. మొత్తానికైతే ఈ పరిస్థితులు చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆ సీనియర్ నేత దూరమైనట్టే.

# దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

## జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్



**పుట్టపర్తి - సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** శుక్రవారం నాడు స్థానిక కలెక్టర్ కార్యాలయం పిజిఆర్ఎస్ హాలు వద్ద.. దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దివ్యాంగుల నుండి వినతులను జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ స్వీకరించారు.దివ్యాంగుల వద్దకే స్వయంగా వెళ్లి వారి సమస్యలను సావధానంగా ఆలకించి, అర్జీలను స్వీకరించి, సమస్య పరిష్కారానికి అధికారులకు జిల్లా



కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ సూచనలు జారీ చేశారు. ఇకపై ప్రతి నెల నాలుగో శుక్రవారం దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి.. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం అని తెలిపారు. దివ్యాంగుల విజ్ఞప్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ వారు ఆదేశించి యున్నారు.ఈ కార్యక్రమంలో పెన్షన్లు 137, వీల్ చైర్ల కొరకు 2, ఇళ్ల స్థలాల కొరకు 5, ఉద్యోగం కొరకు 7, మరియు 15000 పెన్షన్ కొరకు 5 చొప్పున మొత్తం 156 దరఖాస్తులు స్వీకరించబడ్డాయి.ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ కార్పొరేషన్ చైర్మన్ జి.నారాయణస్వామి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడి అర్చన, హాజరైన వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మన్మోహన్ సింగ్ చరితార్థుడు, ఆర్థిక మాంత్రికుడు

## - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** భారత మాజీ ప్రధాని పద్మ విభూషణ్ స్వర్గీయ డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రపంచ చరిత్రలోనే ఒక విలక్షణమైన, విశిష్టమైన రాజకీయ నాయకుడని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసి రెడ్డి కొనియాడారు. శుక్రవారం వేంపల్లి లో స్వర్గీయ మన్మోహన్ సింగ్ ద్వితీయ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ మన్మోహన్ సింగ్ చరితార్థుడు, చరిత్రకారుడు కారణజన్ముడు అని కీర్తించారు. రిజర్వ్ బ్యాంకు గవర్నర్ గా, యూజీసీ చైర్మన్ గా, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా,ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా ఆయన దేశానికి సేవలు అందించారు.పదవులు ఆయనకు అలంకారం కాదు . ఆయనే పదవులకు అలంకారం ఆయన మౌనమే ఆయన భూషణం నిరాడంబరుడు.మిస్టర్ క్లీన్.ఆయన స్థితప్రజ్ఞుడు.గొప్ప పరిపాలన దక్షుడు.ఉపాధి హామీ చట్టం, విద్యా హక్కు చట్టం,సమాచార హక్కు చట్టం గృహహింస నిరోధక చట్టం ఆధార్ కార్డులు ప్రవేశపెట్టడం,ఇలాంటి ఎన్నో చారిత్రాత్మకమైన చట్టాలు ఆయన పాలనలో అమలుకి వచ్చాయి ఆయన ఆర్థిక మంత్రిగా వచ్చేనాటికి దేశం ఆర్థిక సంక్షోభంలో ఉంది.విదేశీ మారక నిల్వలు రెండు వారాలకు సరిపడే విధంగా కేవలం నూరుకోట్ల డాలర్లు మాత్రమే ఉండేవి.అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో సరళీకరణ ప్రైవేటీకరణ ప్రపంచీకరణ సూత్రాలతో దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించిన ఆర్థిక మాంత్రికుడని తులసి రెడ్డి కొనియాడారు.అమెరికా మాజీ అధ్యక్షులు ఒబామాచే గురూజీ అని పిలిపించుకున్నారు డాక్టర్ మన్మోహన్ సింగ్ జీవితం అందరికీ ఆదర్శం అనుసరణీయం మార్గదర్శకం స్ఫూర్తిదాయకం అని తులసి రెడ్డి కొనియాడారు.స్వర్గీయ మన్మోహన్ సింగ్ భారతరత్నకు అన్ని విధాల అర్హుడని భారత ప్రభుత్వం స్వర్గీయ డాక్టర్ మన్మోహన్ సింగ్ కు భారతరత్న ప్రధానం చేయాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం,ప్రసాద్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు బీగాల రామకృష్ణ తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి ఉత్తన్న,తో పిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,బండారు వెంకటేశు, చిన్నకోట్ల నాగరాజు, వినయ్ బాల వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ కవర్లను వాడినా,అమ్మినా అంగళ్ల లైసెన్సులను రద్దు

## - మున్సిపల్ కమిషనర్ డి.రాముడు





**పులివెందుల –సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** ప్రభుత్వ నిషేధాన్ని అతిక్రమించి ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని పులివెందుల మున్సిపల్ కమిషనర్ డి.రాముడు పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ డి.రాముడు ఆదేశానుసారం వార్డు సచివాలయ శానిటరీ సెక్రటరీలు స్థానిక పార్నపల్లి బస్టాండ్ నందు గల కిరాణా షాపుల నుండి ప్రభుత్వ నిషేధిత సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లను, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు.నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను వాడినా, అమ్మినా అంగళ్ల యొక్క లైసెన్సులను రద్దు చేసి అపరాధ రుసుం విధిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది అంగళ్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# 'హిందూ సమ్మేళనం'కు తరలి రండి



**సింహాద్రిపురం – సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** సింహాద్రి పురం మార్కెట్ యార్డ్ లోఆదివారం 3 గంటలకు హిందూసమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమ్మేళనం నిర్వాహకసమితి అధ్యక్షులు కుమ్మేత లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు. హిందూసమ్మేళనం కార్యక్రమం విజయవంతం చేసేందుకు వారు శుక్రవారం గ్రామం లో ప్రచార కార్యక్రమం చేపట్టారు.అనుగ్రహభాషణం పూజ్య కమలానంద భారతి ప్రధాన వక్త శ్రీజగదీశ్వర ప్రసాద్ మహిళ వక్త ఎన్ మానసవెంకట్ తది తరులు పాల్గొంటారన్నారు 3 గంలకు పూజా కార్యక్రమం 4 గంలకు శ్రీ మేధా పాఠశాల విద్యార్థులచేసాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం ముఖ్య వక్తలచే ప్రసంగాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో లీలాస్కూల్ శ్రీనివాసరెడ్డి ఫోటో స్టూడియోవిశ్వ నాథరెడ్డి మీడియా కోఆర్డినేటర్ యాగంటి బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధే నా ధ్యేయం

**- ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు**
**- అభివృద్ధికి బాటలు వేస్తున్న ఎమ్మెల్యే కాలువ**
**- 56. 50 లక్షల సీసీ రోడ్లకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే**





**రాయదుర్గం – సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** అభివృద్ధి పనులకు బాటలు వేస్తూ, దాదాపుగా 56 లక్షల 50 వేల రూపాయలతో నూతన సిసి రోడ్లు పనులకు ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు మాట్లాడుతూ... పట్టణ అభివృద్ధి నా ముఖ్య ఉద్దేశమని, పట్టణంలోని పురాతన రాస వస్తావా కలిగిన రెండు ప్రధానమైన రోడ్లు పనులకు భూమి పూజ చేయడం పట్టణ అభివృద్ధికి బాటలు వేశామన్నారు. మారెమ్మ దేవత, దుగ్గిలమ్మ తల్లి ఆశీస్సులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామన్నారు. కూటమి పర్వతం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ఇప్పటికే దాదాపు నాలుగు కోట్ల విలువ పనులను చేపట్టామన్నారు. మూడు కోట్ల నిధులతో మురుకు కాలువలు సిసి రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. అమృత్ పథకం కింద 78 కోట్లతో తాగునీటి వ్యవస్థను విస్తరిస్తామని, శివారు కాలనీలైన బీటీపీలేవు గౌడ లేవు మల్లాపురం లేవు ఇట్లాంటి శివారు ప్రాంతాల్లో రక్షిత మంచినీటి కార్యక్రమం చేపడతామన్నారు. 23 కోట్ల ప్రత్యేకత నిధులు ఇవ్వడానికి మంత్రి నారాయణ అంగీకరించారని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న , రాయదుర్గం అభివృద్ధికి మంత్రి నారాయణ నిధులు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు అన్నారు. రాబోయే మూడున్నర సంవత్సర కాలంలో మరెన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతామని కాల్వ శ్రీనివాసులు వెల్లడించారు. రెండేళ్లు ముగిసే లోపల నోరు కోట్ల రూపాయలతో పనులు ప్రారంభం చేస్తామన్నారు. రానున్న కాలంలో అర్బన్ ఇన్ఫార్ స్ట్రక్చర్ డెవలప్మెంట్ ఫండ్ పేరుతో కేంద్ర ప్రభుత్వం నిధులు తీసుకోబోతున్నామని తెలియజేశారు. పట్టణాభివృద్ధికి మౌలిక సదుపాయాలు సౌకర్యాలు కృషి చేశాడనే భావన, సంతృప్తిని పట్టణవాసులు పొందే విధంగా వ్యవహరిస్తామని కాల్వ శ్రీనివాసులు విన్న వించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పసుపు నాగరాజు పద్మశాల కార్పొరేషన్ డైరెక్టర్ పోరాల పురుషోత్తం మాజీ డైరెక్టర్స్ ఘంటసాల హనుమంతు కస్టర్లించార్జ వెంకటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ గాజుల వెంకటేశులు పై తోట రామంజి కర్రెన్న తంచరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి



**వేంపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** ఆంధ్ర ప్రదేశ్ విభజన చట్టం 13వ షెడ్యూల్ ప్రకారం ఆంధ్రప్రదేశ్లో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ విశ్వవిద్యాల యాన్ని ఏర్పాటు చేయాలి. కానీ దురదృష్టవశాత్తు 12 సంవత్సరాలు కావస్తు న్నా కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్లో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరం.ఇప్పుడైనా ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆంధ్రప్రదేశ్లో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని తులసి రెడ్డి మోడీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# పట్టు వస్త్ర అలంకారంలో చౌడేశ్వరి దేవి



**పులివెందల – సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** పులివెందుల పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి రోడ్డు సమీపాన కొలువై ఉన్న శ్రీ చౌడమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శుక్రవారం పురస్కరించుకొని ఉదయాస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన కుంకుమార్చన తదితర పూజ కైకర్యాల అనంతరం అమ్మవారు పట్టు వస్త్రాల, గజమాల నిమ్మకాయల మాల అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందరరేగా ఆలయ నిర్వాహకులు అర్చకులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం అమ్మవారికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకోవడం జరుగుతోందన్నారు. ప్రత్యేకించి ధనుర్మాసంలో తెల్లవారుజామున నుండి అమ్మవారికి బోనాల నైవేద్యం సమర్పించి విశేష పూజలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మారుమోగాయి. అనంతరం నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందించి అమ్మవారి ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు



# అంధుల ఆశ్రమంలో స్వీట్లు, పండ్లు, బ్రెడ్ పంపిణీ

## - గ్రంథాలయ చైర్మన్ భాను ప్రకాష్



**పులివెందుల– సూర్య వాస్తవం, డిసెంబర్ 26 :** దివంగత నేత వంగవీటి మోహన రంగా బడుగు బలహీన పీడిత శ్రామిక వర్గాల ఆశాజ్యోతిగా నిలిచారని గ్రంథాలయ చైర్మన్ భాను ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం రంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రంగవర్ధంతిని పురస్కరించుకుని స్థానిక వీర నారాయణ అంధుల ఆశ్రమంలో అనాథ మహిళలకు స్వీట్లు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాను ప్రకాష్ మాట్లాడుతూ ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చి ప్రజల మధ్య ఉంటూ వారి బాగోగులు తెలుసుకుంటూ వారి కష్టాల్లో ఒకడిగా ఎప్పు డు వెన్నంటిన ప్రజా నాయకుడు వంగవీటి మోహన రంగ అని తెలిపారు.. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పగడాల రాజశేఖర్ రాచ నేని ఆంజనేయులు ఆశ్రమ నిర్వాహకులు రామమోహన్ తదితరులు పాల్గొన్నారు

# కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్లో ఏర్పాటు చేయాలి



**వేంపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** ఆంధ్ర ప్రదేశ్ విభజన చట్టం సెక్షన్ 85 ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన 60 రోజు లోపల కృష్ణానది యాజ మాన్య బోర్డ్ కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్లో ఏర్పాటు చేయాలి. కానీ దురదృష్ట వశాత్తు 12 సంవత్సరాలైనా ఇప్పటికీ హైదరాబాదు నుండి ఆంధ్రప్రదేశ్కు తరలించక పోవడం శోచనీయం. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదు నుండి ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు కి గాని శ్రీశైలానికి గాని తరలించాలని తులసి రెడ్డి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.



## డ్వాక్రా మహిళలతో ఎమ్మెల్యేను కలిసిన కౌన్సిలర్

**ప్రొద్దుటూరు– సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులోని డ్వాక్రా మహిళలతో కలిసి 14 వ వార్డు కౌన్సిలర్ షేక్ జిలాన్ బాషా శుక్రవారం ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస నగర్ లోని 9, 14వ వార్డులలో దాదాపు 2000 కన్నా ఎక్కువ మంది మహిళలు డ్వాక్రా గ్రూపులలో ఉన్నారని, వారు డ్వాక్రా గ్రూపుల సమావేశాలు జరుపుకునేందుకు సరైన స్థలము లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, రోడ్ల పైనే మీటింగులు నిర్వహిస్తున్నారని, తన దృష్టికి తీసుకుని వచ్చినారని. వారందరి అభ్యర్థన మేరకు డ్వాక్రా మహిళల తరఫున కొంతమంది మహిళా సభ్యులతో కలిసి ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి కి సమస్యను వివరించి, వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగిందని తెలిపారు. అలాగే శ్రీనివాస నగర్ లోని ప్రజల సౌకర్యం కోసం టూ టౌన్ బైపాస్ లోని మున్సిపల్ పార్కుల వద్ద కడప నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను నిలుపు చేయుటకు రిక్వెస్ట్ స్టాప్ ని ఏర్పాటు చేయవలసినదిగా కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే డ్వాక్రా మహిళల సమస్యను పరిష్కరి స్తానని, రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయుటకు తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

## పెద్దాయనను కలిసిన జిల్లా నూతన సారథులు



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** జిల్లాలో పెద్దాయనగా పేరుగాంచిన ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ని తెలుగుదేశం పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు చడిపిరాళ్ళ భూపేష్ రెడ్డి, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి వైఎస్ జాబీవుల్లా లు మండలంలోని రాధా నగర్ లో ఎమ్మెల్యే స్వగృహం నందు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ కడప జిల్లాలో రాబోయే పంచాయితీ, మునిసిపల్ ఎన్నికలలో పార్టీ ని ప్రతిష్టంగా తీసుకుపోయి భారీగా విజయాలు సాధించాలని తగిన సూచనలు సలహాలు తెలియజేశారు. కొత్తగా జిల్లా కమిటీలో వచ్చిన వారందరికీ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తనయుడు నంద్యాల కొండారెడ్డి ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## సమాజంలో హింసకు గురవుతున్న మహిళలు సఖి వన్ స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించవచ్చు..

- ఆపదలో ఉన్న మహిళలకు అండగా
ఉచిత ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 26 :** సమాజంలో హింసకు గురవుతున్న మహిళలు ఎవరైనా సరే సఖి వన్ స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించవచ్చని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనం వద్ద సఖి వన్ స్టాప్ సెంటర్ వాహనాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న సమాజంలో హింసకు గురి అవుతున్న మహిళలకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం సఖి వన్ స్టాప్ సెంటర్ ను అనంతపురము గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని, ఆపదలో ఉన్న మహిళలు ఎవరైనా వన్ స్టాప్ సెంటర్‌ని ఆశ్రయించవచ్చున్నారు. మహిళలకు ఉమెన్ హెల్ప్ లైన్ 181 కూడా ఉచితంగా కలదని తెలిపారు. సఖీ వన్ స్టాప్ సెంటర్‌లో మహిళలకు ఉచితంగా కౌన్సిలింగ్ న్యాయ సహాయము, పోలీసు సహాయము, వైద్య సహాయము మరియు షెల్టర్ కూడా ఇవ్వబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్ పిడి ఈ.అరుణకుమారి, జిల్లా మిషన్ వాత్సల్య కోఆర్డినేటర్ డా.బి.యన్. శ్రీదేవి, సి.డి.పి.ఓలు, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది మరియు డి.సి.పి.ఓ మంజునాథ్ పాల్గొన్నారు.

# క్రైస్తవంపై ఆర్‌ఎస్‌ఎస్ కిరాతకం

- ప్రధాని మోడీ మత విద్వేషం
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ధ్వజం



**కడప బ్యూరో – సూర్యవాస్తవం, డిసెంబర్ 26:** క్రిస్మస్ పండుగ రోజున రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అల్లరి మూకలు పలు రాష్ట్రాల్లోని చర్చిలలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవు లపై దాడులు చేయడం అమానుషకర మనీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ధ్వజ మెత్తారు. ఎన్డీఏ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ మత విద్వేషం మరో మారు బహిర్గతమైందని దుయ్యబట్టారు. కడపలోని తన కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, అస్సాం , ఒడిస్సా గుజరాత్ తదితర రాష్ట్రాల్లో మత విద్వేష భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాల అండతో విశ్వహిందూ పరిషత్, బజరంగ దళ్, ఆర్‌ఎస్‌ఎస్ గుండాలు పండుగనాడు దాడి చేయడం దుర్మార్గ మన్నారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు, అధికారాల ప్రకారం మత స్వేచ్ఛ ప్రతి ఒక్క పౌరుడికి ఉందన్నారు. కానీ కేవలం అధికార అండతో ప్రధాని నరేంద్ర మోడీ, హెూం మంత్రి అమిత్ షా, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ నిర్దేశంలోనే ఈ దాడులు చేశారని విమర్శించారు ఈ దాడులను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. బాధితులకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు బాసటగా నిలుస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ మద్దతుతో నడుస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం ద్వారా మైనార్టీలపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుపతి, తిరుమల లో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మత విద్వేషాలకు మద్దతిస్తున్నట్లు స్పష్ట మౌతోందన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ఇలాంటి ఘాతుకాలకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. క్రిస్మస్ పండుగ నాడు చర్చిల్లో విధ్వంసం సృష్టించడం, వాణిజ్య సముదాయాల్లో క్రిస్మస్ అలంకర ణలను ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజస మని ప్రశ్నించారు. దేశంలో శాంతి భద్రతలు కరవయ్యాయని, మత స్వేచ్ఛ ఏమాత్రం లేకపోవడంపై అంతర్జాతీయ సమాజం దేశ ప్రతిష్టను దిగజారుస్తోందన్నారు దీనికి ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూర్తిగా బాధ్యులని విమర్శించారు.

బంగ్లాదేశ్ లో ఇద్దరు హిందువులను హతమార్చారని ఆర్‌ఎస్‌ఎస్, ఎన్డీఏ ప్రభుత్వం ప్రేరణతో విశ్వహిందూ పరిషత్ ఢిల్లీలో నిరసన తెలియజేసిన తరువాత క్రైస్తవులపై దాడులు చేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు హమీద్, పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్ బాషా తదితరులు పాల్గొన్నారు

# సీఐ, ఎస్ఐలతో డీఎస్పీ సమీక్ష



**పులివెందుల– సూర్య వాస్తవం, డిసెంబర్ 26 :** కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు పులివెందుల సబ్ డివిజనల్ అధికారి మురళి నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు మరియు ఎస్ఐల తోటి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి మురళి నాయక్ మాట్లాడుతూ 2025 లో నమోదైన పలు రకాల కేసుల గురించి చర్చించారు. ఇందులో భాగంగా 2025 సంవత్సరములో సబ్ డివిజన్ పరిధిలో 90 దొంగతనాలు నమోదు కాగా వాటిలో మొత్తం ప్రాపర్టీ 59,13,380 /- రూపాయలు దొంగతనం కాగా వాటిలో 57 కేసులలో ముద్దాయిలను కనుగొని వారి ద్వారా 36,64,350/- రూపాయలు రికవరీ చేయడం జరిగినది. ఇందులో 60 శాతం చోరీ జరిగిన సొమ్మును రికవరీ చేయడం జరిగినది. అదేవిధంగా ఇంకా పెండింగ్ లో ఉన్న 33 కేసులలో ముద్దాయిలను కనుగొనటానికి పులివెందుల ట్రాఫిక్ సిఐ హాజీవల్లి ఆధ్వర్యంలో సిబ్బంది వేణుగోపాలరెడ్డి ,రామ్ రమేష్,శివ,సుబ్రమణ్యం ల తోటి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయటం జరిగినది. ఆదేవిధముగా దొంగతనం కేసులకు సంబందించి నేరాలు జరగకుండా ముందస్తు చర్యలలో భాగముగా సబ్ డివిజన్ పరిధిలో మూడు చెక్ పోస్టులు 1)కనంపల్లె 2)అద్దాలమర్రి 3)పార్నపల్లె ల వద్ద ఏర్పాటు చేసి వాటి ద్వారా ఇతర జిల్లాల నుంచి పులివెందులకు రాకపోకలు సాగించే వారిపై 24 గంటలు నిఘా ఉంచి వాహనాలను చెక్ చేయటం జరుగుతుంది. అదేవిధముగా పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడెక్కడ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయో వాటిని గుర్తించి,ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించుకొని రోడ్డు ప్రమాదాలను తగ్గించటానికి నివారణ చర్యలు తీసుకోవటం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా అయ్యప్ప ఆలయంలో పల్లకి సేవ

**పులివెందుల– సూర్య వాస్తవం, డిసెంబర్ 26 :** పులివెందుల పట్టణ పరిధిలోని కోతి సమాధి వద్ద అయ్యప్ప స్వామి ఆలయంలో అందాల పల్లకిలో అయ్యప్ప స్వామి పల్లకి సేవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో భాగంగా స్వామివారికి ఉదయాస్తమాన పంచామృతాభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి భక్తులకు దర్శనం ఇవ్వగా మహా మంగళహారతి స్వీకరించి భక్తులు అయ్యప్ప శరణు ఘోషతో పరవశించారు. అదేవిధంగా సాయంకాల సమయాన గురుస్వామి వెంకటరామిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు మధు స్వామి సాయి స్వామి మరియు ఇతర అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో సాయంకాల సమయాన స్వామివారి పల్లకి సేవ గుడి ఆవరణలో అత్యంత వైభవంగా కొనసాగగా అయ్యప్ప భజన సంకీర్తనలు పడి పాట మహా మంగళహారతి అనంతరం హరివరాసనం కార్యక్రమాలతో అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా గురుస్వామి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ శబరిమలలో నవంబర్ 16న అయ్యప్ప ఆలయ ద్వారాలు తెరుచుకుని నేటి వరకు విశేష పూజలు అందుకొని రేపటి నుండి మూడు రోజులపాటు ఆలయ ద్వారాలు మూసి వేయబడతాయని అనంతరం వనయాత్ర పేరుతో పెద్ద పాదం ద్వారా జ్యోతి వరకు అయ్యప్ప స్వామికి దర్శనం చేకూరుతుందని పల్లకి సేవ కార్యక్రమాలు ముగుస్తాయని తెలియజేశారు. ఈ సందర్భంగా హాజరైనటువంటి భక్తజనానికి అల్పాహారాన్ని అందజేశారు.

## ప్రతి సమస్యను పీజీ ఆర్ఎస్ ద్వారా పరిష్కరిస్తాం..

- ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే కాలువ శ్రీనివాస్



**రాయదుర్గం – సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** ప్రతి సమస్యను పిజిఆర్ఎస్ పరిష్కరించేందుకు వేగవంతం చేస్తామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు వెల్లడించారు పట్టణంలోని శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిజిఆర్ఎస్ సిస్టంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, ప్రజల ఫిర్యాదులను, అందిన అర్జీలపై మండల డివిజన జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రతి దిశలోను సమీక్షిస్తున్నందున పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. నాణ్యమైన పరిష్కారం మార్గానికి పిజిఆర్ఎస్ విధానం ఎంతగానో దోహదపడుతుందన్నారు ఇప్పటివరకు తాను 463 ఫిర్యాదులు స్వీకరిస్తే అందులో దాదాపుగా 2007 ఫిర్యాదులను పరిష్కారం చేయడం జరిగిందన్నారు. మిగిలిన ఫిర్యాదులు సంబంధిత అధికారులు పరిశీలనలో ఉన్నాయ న్నారు. నియోజకవర్గ పరిధిలోని కొందరు ఫిర్యాదుదారులు ఆధార్ నెంబర్లు కర్ణాటక ప్రాంతానికి చెందిన కావడంతో సమస్యలు తలెత్తుతుందన్నారు. పి జి ఆర్ ఎస్ లో నమోదు చేయడం సాధ్యపడడం లేదన్నారు. అట్లాంటి వాటిని నేరుగా అధికారులకు పంపడం జరుగుతుందని వాటిపై సమీక్ష చేసే అవకాశం లేనందున ఫిర్యాదులు చేసేటప్పుడు స్థానికంగా ఆధార్ కార్డు ఉన్న బంధువుల పేర్లతో ఫిర్యాదు చేయించాలని ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు ప్రజలకు విజ్ఞప్తి చేసి సూచించారు.

# టెయిలింగ్ పాండ్ ఎత్తును పెంచడం అన్యాయం

**- పులివెందుల ఆర్డీఓ చిన్నయ్యకు వినతి**



**వేముల - సూర్య వాస్తవం, డిసెంబర్ 26**
తమ గ్రామ సమస్యలు పరిష్కరించిన తర్వాతే టెయిలింగ్ పాండ్ ఎత్తు పనులు ప్రారంభిస్తామని యురేనియం అధికారులు కలెక్టర్ కు ఇచ్చిన హామీని తుంగలో తొక్కుతూ నేడు టెయిలింగ్ పాండ్ ఎత్తు పనులను ప్రారంభించడం అన్యాయమని వెంటనే టెయిలింగ్ పాండ్ ఎత్తు పనులను అడ్డుకోవాలని పులివెందుల ఆర్డిఓ చిన్నయ్యకు కేకే కొట్టాల గ్రామస్తులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. యురేనియం కర్మాగారం నుంచి వెలుపడే వ్యర్థాలను నిలువచేసే టేయిలింగ్ పాండ్ వల్ల నష్టపోతున్నామంటూ గత కొన్ని సంవత్సరాలుగా కేకే కొట్టాల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే టెయిలిగ్ పాండ్ నిల్వ సామర్థ్యం పూర్తికావడంతో ఉన్న టెయిలిగ్ పాండు ఎత్తు పెంచేందుకు యురేనియం అధికారులు ప్రయత్నాలు చేస్తుండగా గత కొన్ని నెలలుగా కేకే కొట్టాల గ్రామస్తులు, టిడిపి నాయకులు అడ్డుపడుతున్న విషయం తెలిసిందే. గత కొన్ని రోజుల క్రితం పులివెందుల టీడీపీ ఇంచార్జి బి. టెక్ రవి, పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, యురేనియం అధికారులు కేకే కొట్టాల గ్రామస్తులతో జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సమావేశమై ప్రస్తుతం ఉన్న టెయిలింగ్ ఫండ్ లో మరమ్మతులు పనులు చేసేందుకు మాత్రమే అనుమతిస్తున్నట్లు ఆరు నెలల లోపల కేకే కొట్టల గ్రామాన్ని దాని సంబంధించిన భూములను అధికారులు తీసుకొని పరిహారం అందించాలని కలెక్టర్ యురేనియం అధికారులకు సూచించి ప్రస్తుతానికి మరమ్మత్తులు మాత్రమే చేసుకునేందుకు అధికారులకు అనుమతి ఇచ్చారని కానీ యురేనియం అధికారులు మరమ్మతులు మాటున టెయిలింగ్ పాండ్ ఎత్తు పనులను పెంచేందుకు రెండు రోజులుగా పెద్ద పెద్ద మిషన్లు, హిటాచీలు, టిప్పర్లతో టెయిలింగ్ పాండ్ చుట్టూ మట్టిని తోలుతూ టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నారని కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుత ఉన్న టెయిలింగ్ పాండ్ లో మరమ్మత్తు పనులు మాత్రమే చేయాలని ఆలా కాకుండా యురేనియం అధికారులు చేస్తున్న ఎత్తు పనులను అడ్డుకొని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని పులివెందుల ఆర్డీవో చిన్నయ్య కు కే కె కొట్టాల గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.

## గోల్డ్ మెడల్ సాధించిన డాక్టర్ మహమ్మద్ అబ్బాస్‌కు సత్కారం

**- సీపీపీ జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్**



**రాయచోటి-సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** డాక్టర్ షేక్ మహ మ్మద్ అబ్బాస్ 2025లో ఎన్టీఆర్ డెంటల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్ నుండి గోల్డ్ మెడల్ సాధించి నందుకు జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు పీసీసీ జనరల్ సెక్రటరీ షేక్ అల్లా బకష్, అన్నమయ్య జిల్లా మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఫయాజ్ , మాజీ రాయచోటి పట్టణ అధ్యక్షుడు టైగర్ శర్వాని ఫారుక్ , జిల్లా సెక్రెటరీ ఆఫీజుల్లా, ఎస్ ఎస్ భాష,(ఐయూఎంఎల్) డాక్టర్ సుహేల్, సాఫ్ట్వేర్ ఇంజనీర్ సుహేల్ పలువురు ప్రముఖులు రాయచోటి పట్టణంలోని డాక్టర్ నివాసానికి వెళ్లి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అల్లా బకష్ మాట్లాడుతూ డాక్టర్ వృత్తిలో మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆయన అన్నారు. రాయచోటి పట్టణంలో డెంటల్ ఆసుపత్రిని ప్రారంభిస్తే తమ కు పూర్తి సహాయసకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



**లక్కిరెడ్డిపల్లి -సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై డి.శోభ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా కిషోర బాలికలు బ్యాడ్ టచ్ గుడ్ టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు.అంతే కాకుండా మగ పిల్లలు ఏడిపిస్తే వెంటనే 100 కానీ పోలీసులకు వెంటనే తెలియజేయనున్నారు. కష్టపడి చదివితే మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆమె విద్యార్థులకు సూచించారు. 9 10 ఇంటర్మీడియట్ తరగతుల్లో సక్రమంగా చదువుపై దృష్టి పెడితే గొప్ప ప్రయోజకులవుతారని ఆమె తెలియజేశారు. ఇంస్టాగ్రామ్ ఫేస్ బుక్ వాట్సాప్ నుండి సెల్ ఫోన్లను పూర్తిస్థాయిలో దూరంగా ఉంచాలన్నారు. కష్టపడి చదివినప్పుడే పాఠశాలకు తల్లిదండ్రులకు అందరికీ మంచి పేరు వస్తుందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరాల రమేష్ అధ్యాపకులు నాగయ్య రామ్మోహన్ శివరామకృష్ణ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.





## హిందూ సమ్మేళనానికి ఎంపీ అవినాష్ రెడ్డికి ఆహ్వానం

**- హిందూ సమ్మేళన నిర్వాహకులు**

**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** డిసెంబర్ 28వ తేదీ నిర్వహించ తలపెట్టిన విశ్వహిందూ సమ్మేళన కార్యక్రమానికి హాజరై సనాతన ధర్మ పరిరక్షణకు మద్దతు తెలపాలని జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వాహకులు ఆహ్వానాన్ని అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక సంగ్ ఏర్పాటై వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన దేశవ్యాప్తంగా హిందువులను చైతన్యపరిచేందుకు దేశంలో దాదాపు 81 వేల చోట్ల నిర్వహణలో భాగంగా పులివెందులలోని వాసవి ఫంక్షన్ హాల్ నందు ఆదివారం నిర్వహించ తలపెట్టిన కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని ఎంపీ అవినాష్ రెడ్డికి వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన కార్యక్రమానిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

**- అవగాహన రాహిత్యంగా మాట్లాడడం సబబు కాదు - వైకాపా నాయకులు**

**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబర్ 26 :** ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విమర్శలు చేసేటప్పుడు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని వైకాపా రాష్ట్ర నూర్ భాషా సంఘం అధ్యక్షుడు రసూల్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చంద్రమౌళి, చేనేత జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, లు అన్నారు. శుక్రవారం వారు పాత ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హాయంలోనే కడప బెంగుళూరు రైల్వే లైన్ పనులు ప్రారంభమయ్యాయి అన్నారు. ఆయన అకాల మరణంతో ఆ పనులు నిలబడిపోయాయని వారన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ఆ పనులకు సంబంధించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు 9.8. 2024లో పెల్లి మరి టు పుట్టపర్తి వరకు నిలబడిపోయిన పనులను ప్రారంభించాలని లెటర్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. కానీ కేంద్రం స్పందించకపోవడంతో ఆ పనులు అలాగే పెండింగ్లో నిలబడిపోయాయి అన్నారు. ముద్దనూరు టు బెంగళూరు వయా ముదిగుబ్బ మీదుగా లైను పనుల కోసం ఎన్నోసార్లు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి రైల్వే శాఖ మంత్రి కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. పార్లమెంటులో ఆయన ప్రస్తావన కూడా లేవనెత్తడం జరిగిందన్నారు. వైజాగ్ నుంచి ధర్మవరం పోయే ట్రైన్ కోసం ముద్దనూరులో నిలిపే విధంగా చూడాలని రైల్వే మంత్రి తో మాట్లాడి వినతిపత్రం కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ఇవన్నీ వాస్తవాలు తెలియకుండా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఇష్టానుసారం మాట్లాడడం పద్ధతి కాదన్నారు. నంద్యాల వయా జమ్మల మడుగు వయా కడప మీదుగా రైల్వే లైను గత ప్రభుత్వంలోనే వచ్చిందన్నారు. ఈ రైల్వే లైన్ల కోసం కృషి చేసిన వ్యక్తులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డిలే అన్నారు. ఇప్పటికైనా నిలబడిపోయిన రైల్వే పనులను మీ ప్రభుత్వంలోనైనా పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ప్రదీప్ రెడ్డి, శ్రీరాములు, వెంకటరెడ్డి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తా

**- టీడీపీ కడప పార్లమెంటరీ కార్యదర్శిగా శివాంజనేయులు నియామకం**



**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబర్ 26 :** తెలుగుదేశం పార్టీ కడప పార్లమెంటరీ కార్యదర్శిగా హనుమంతు గారి శివాంజనేయులు నియమితుల య్యారు. ఆ మేరకు గురువారం అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంద ర్భంగా హనుమంతు గారి శివాంజనేయులు మాట్లాడుతూ టిడిపి పార్టీ అభివృద్ధే లక్ష్యంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి విజయం ధ్యేయంగా పనిచేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాపై నమ్మకంతో ఇచ్చిన పదవికి తప్పక న్యాయం చేస్తానని తెలుగుదేశం పార్టీ అభ్యున్నతికి అదేవిధంగా ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానని పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతానని తెలియజేసుకుంటూ నాకు ఈ పదవి రావడానికి సహకరించిన పులివెందుల నియోజకవర్గం టిడిపి ఇన్చార్జివర్యులు మా రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి మరియు హై లెవెల్ కెనాల్ చైర్మన్ మా రెడ్డి జోగిరెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, నియామకానికి సహకరించినటువంటి తెలుగుదేశం పార్టీలోని అందరికీ నా ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాని తెలిపారు.

## ఘనంగా వంగవీటి మోహన్ రంగా వర్ధంతి

**- నివాళులర్పించిన జనసేన పార్టీ నేత డా.దాసరి రవిశంకర్**




**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 26 :** దివంగత రాజకీయ నాయకుడు వంగవీటి మెహన్ రంగా వర్ధంతి సందర్భంగా స్థానిక పట్టణంలో జనసేన పార్టీ నేత డా.దాసరి రవిశంకర్ ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో వంగవీటి మోహన్ రంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాసరి రవిశంకర్ మాట్లాడుతూ రంగా 1988 డిసెంబర్ 26న విజయవాడ లో నిరాహార దీక్ష చేస్తుండగా హత్య కు గురి కావడం జరిగిందని, బడుగు బలహీన వర్గాల ఆశ జ్యోతి, ప్రజా సమస్యల పోరాటానికై తన ప్రాణాలు సైతం అర్పించిన మహనీయుడు వంగవీటి మోహన్ రంగా అని దాసరి రవిశంకర్ కొనియాడారు. ఈ కార్యక్రమం లో రమణ, చెన్నకృష్ణా రెడ్డి, నారాయణ, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా

**- శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం నాయకులు**




**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబర్ 26 :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా అని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం సీనియర్ నాయకులు యార్వ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం కార్యాలయంలో ప్రజా నాయకుడు వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా నిలిచారని, ప్రజల మధ్య ఉంటూ వారి బాగోగులు తెలుసుకుంటూ వారి కష్టాలలో ఒకడిగా ఉంటూ ప్రజలలో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం ప్రధాన కార్యదర్శి రచనేని ఆంజనేయులు, మాజీ అధ్యక్షుడు సోపాల వీరా, అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, బలిజ సంఘం నాయకులు కడియాల లక్ష్మీనారాయణ, కొంగనపల్లె మురళీ, కొండ్రావు, ఐటీఐ సాయి, సర్వేశ్వరుడు, శేఖర్, సాగర్, సురేంద్ర, పెద్ద వీరయ్య, తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు విడుదల

**- ఏపీసీ దేవరాజు**

**కదిరి- సూర్య వాస్తవం, డిసెంబర్ 26 :** జిల్లాలోని 30కేజీబీవీ లలో 6 వ తరగతి నుండి 12 వ తరగతి చదివే 7735 మంది విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీల నిధులు విడుదలైనట్లు శ్రీ సత్య జిల్లా సమగ్ర శిక్ష ఏపీసి డాక్టర్ దేవరాజు జి సి డి వో అనిత తెలిపారు. ఒక్కొక్క విద్యార్థికి నెలకు 100 రూపాయలు చొప్పున 10 నెలలకు రూ 7735000 కాస్మెటిక్ చార్జెస్ మరియు 10వ , 11వ, 12 వ తరగతుల విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల రవాణా చార్జీల నిమిత్తం ఒక్కొక్కరికి 350 రూపాయలు చొప్పున 2927మంది విద్యార్థులకు రూ 1024450 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నేరుగా విద్యార్థుల తల్లిదండ్రులు అకౌంట్ నందు జమ చేశామని శ్రీ సత్య సాయి జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ దేవరాజు,జీసిడీఓ అనిత తెలియజేశారు.

# సంకీర్తన రథోత్సవంలో అయ్యప్ప స్వాములు

- అయ్యప్ప స్వామి ఉత్సవ ఊరేగింపులో భారీగా పాల్గొన్న అయ్యప్ప భక్తులు
- పాల్గొన్న ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు





**రాయదుర్గం - సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** పట్టణంలోని సంకీర్తన రథోత్సవ కార్యక్రమంలో భారీగా అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి ఉత్సవ ఊరేగింపులో, భజన, సంకీర్తన, స్వామివారి నామస్మరణంతో పట్టణం మార్మోగింది. స్వామి వారి కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పట్టణంలోని శాంతినగర్ లో వెలసిన హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో నగర సంకీర్తన రథోత్సవ కార్యక్రమం ఉదయం ఐదు గంటల నయాభిషేకం 6 గంటలకు అష్ట ద్రవ్య అభిషేకము 9 గంటలకు హరిహరపుత్ర అయ్యప్ప స్వామి వస్త్రా ఊరేగింపు వినాయక సర్కిల్ నుండి ఓబులాచర్ రోడ్డు మీదుగా స్వామివారిని భక్తిశ్రద్ధలతో భజన బృందం ఊరేగింపుగా తీసుకెళ్లారు. హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయ ప్రధాన అర్చకులు బండ శివప్రసాద్ మాట్లాడుతూ... స్వామివారికి నిత్యం అభిషేకం పడిపూజలు నిర్వహించుకోవడం, స్వామివారి ధ్యానంలో భక్తాదులు నిమగ్నమవడం, స్వామి నామస్మరణంలో మమేకమై ప్రపంచ వ్యవహారాలు వీడి, సన్మార్గంలో నడవడం గొప్ప విషయమని, ఆధ్యాత్మిక కార్యక్రమంలో మానవునికి ప్రశాంతత కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాడు సిద్దేశ్వర్ బంగి శివ కృష్ణ ఆలూరు రమేష్ శెట్టి రాంప్రసాద్ దాసరి తిమ్మరాజు ఎల్లప్ప అయ్యప్ప స్వామి భక్తాదులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నాన్ ఆప్కాస్ మున్సిపల్ కార్మికులను
# ఆప్కాస్‌లో చేర్చాలి: సీఐటీయూ




**నాయుడుపేట- సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** నాన్ ఆప్కాస్‌లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను వెంటనే ఆప్కాస్‌లో చేర్చాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డీపల్లి చెంగయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నాయుడుపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డీపల్లి చెంగయ్య విలేకరులతో మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని కోరారు. మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, ఆప్కాస్, నాన్ ఆప్కాస్ సిబ్బందికి పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ఏడాది డిసెంబర్ 26 నుంచి ఈ ఏడాది జనవరి 11 వరకు 17 రోజుల పాటు మున్సిపల్ కార్మికులు నిర్వహించిన సమ్మె సందర్భంగా అప్పటి ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని అన్నారు. ఆప్కాస్ ద్వారా పదవీ విరమణ పొందుతున్న కార్మికులకు 10 సంవత్సరాల సేవ ఉంటే రూ.75 వేల రిటైర్మెంట్ బెనిఫిట్, ఆపై ప్రతి ఏడాదికి రూ.2 వేల చొప్పున చెల్లిస్తామని కుదిరిన ఒప్పందానికి సంబంధించిన జీవోను తక్షణమే జారీ చేయాలని డిమాండ్ చేశారు.
ఎక్స్‌గ్రేషియాను రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచుతామని ఒప్పందం కుదిరినప్పటికీ ఇప్పటివరకు జీవో జారీ కాలేదని, వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. పర్మినెంట్ కార్మికులకు డీఏ బకాయిలు, సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాలని, ఎన్ఎంఆర్ కార్మికులకు గత ఏడేళ్లుగా పెంచని వేతనాలను సవరించి నెలకు రూ.21 వేల జీతం ఇవ్వాలని అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన 'సమాన పనికి సమాన వేతనం' తీర్పును అమలు చేయాలని, లేకపోతే 2013లో మున్సిపల్ శాఖ జారీ చేసిన జీవో ఆర్టీ నంబర్ 16/15 ప్రకారం పీఆర్సీ వేతనాలు, డీఏ, మధ్యంతర భృతి, ఇంజనీరింగ్ కార్మికులకు టెక్నికల్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ చెల్లింపు, పదవీ విరమణ వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంపు, అనారోగ్యం, మరణం లేదా రిటైర్మెంట్ అయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. చట్టబద్ధమైన సెలవులు, రక్షణ పరికరాలు అందించడంతో పాటు సిబ్బంది సంఖ్య పెంచి పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు కాలేషా, సురేష్, వేణుగోపాల్‌తో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.



## స్వచ్ఛభారత్‌లో భాగంగా
# పల్లెలకు ఫుడ్ కార్ట్స్ పంపిణీ
### - ఈవోపీఆర్డీ చంద్రమౌళి

**కనేకల్లు -సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** కనేకల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం నుండి ఫుడ్ కార్ట్స్ (చెత్త సేకరణ బండ్లు) తెప్పించి పంపిణీ చేస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. గ్రామాల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని, ఈ పరిస్థితిని మార్చేందుకు స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇంటింటి నుంచి చెత్తను సేకరించి శుభ్రంగా నిర్వహించేందుకు ఈ ఫుడ్ కార్ట్స్ ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కనేకల్ మండల పరిధిలోని గ్రామాలతో పాటు, ఇక్కడి నుంచి రాయదుర్గం నియోజకవర్గంలోని గుమ్మగట్ట మండలానికి కూడా ఫుడ్ కార్ట్స్ పంపిస్తున్నామని చంద్రమౌళి తెలిపారు. గ్రామస్థులు స్వచ్ఛతపై అవగాహన పెంచుకుని ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించాలని ఆయన కోరారు. స్వచ్ఛమైన గ్రామాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని, అందరూ కలిసి శుభ్రత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే విజయశ్రీ



**పెళ్లకూరు- సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** తిరుపతి పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుపతిలో నూతనంగా నిర్మించిన జిల్లా పోలీసు కార్యాలయాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. తిరుపతి వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చేలా అమలు చేయాలని కోరినట్లు తెలిపారు.

## కామన్ అడ్మిషన్ టెస్టులో ట్రిబుల్ ఐటీ విద్యార్థి ఘనత



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 26 :** ఆర్జీయూకేటీ ఆర్కే వ్యాలీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో చదువుతున్న సయ్యద్ మహమ్మద్ సైఫ్ అనే విద్యార్థి గత రెండు రోజుల కిందట విడుదల చేసిన క్యాట్ (కామన్ అడ్మిషన్ టెస్ట్)2025 ఫలితాలలో 98.18 పర్సంటైల్ సాధించారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థి ప్రఖ్యాత ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ సంస్థలలో సీటు దక్కించుకోగలరని సిఎస్సి విభాగపు అధిపతి డాక్టర్ రత్నకుమారి తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ ఏ.వీ.ఎస్.ఎస్ కుమారస్వామి గుప్తా , పరిపాలన అధికారి డాక్టర్ పి.రవికుమార్, డీన్ అకాడమిక్స్ రమేష్ కైలాస్ సదరు విద్యార్థిని అభినందించారు.

## ఎమ్మెల్యే శ్యాం బాబు జన్మదినాన రక్తదాన శిబిరం



**పత్తికొండ టౌన్- సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** పత్తికొండ పట్టణంలోని పేరు బజారులో ఎమ్మెల్యే శ్యామ్ కుమార్ జన్మదిన సందర్భంగా పత్తికొండ టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు ముని నాయుడు ఆధ్వర్యంలో బ్లడ్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని పత్తికొండ రూరల్ సీఐ పులి శేఖర్ రూబ్బును కట్ చేసి ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమం గురించి మునినాయుడు, ఆవారపు బొట్టు శంకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్యాం కుమార్ జన్మదిన సందర్భంగా బ్లడ్ క్యాంపులో 30 మంది పత్తికొండ పట్టణం మరియు వివిధ గ్రామాల నుంచి యువత పెద్ద ఎత్తున తరలివచ్చి బ్లడ్ క్యాంప్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది అదేవిధంగా రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి అని మాట్లాడుతూ అనేకమంది రోగాల బారిన పడే వారికి ఈ రక్తదానం ఉపయోగపడుతుంది అని అదే విధంగా ప్రతి నెలకు ఒకసారి రక్త మార్పిడి చేపించుకుంటున్న తల సేమియా బాధితులు కూడా ఈ రక్తదానం ఉపయోగపడుతుందని ఆయన తెలియజేయడం జరిగింది అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు జూటూరు తిమ్మరాజు పులికొండ సురేంద్ర నాయుడు రజాక్ %దీ%.పవన్ తమ్మినేని అనిల్ కుమార్ గంగసాని మోహన్ బిజెపి అసెంబ్లీ కోకన్వీనర్ గోవర్ధన్ నాయుడు చిన్న హొసూరు రాజా తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు




**కనేకల్ -సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 100వ వార్షికోత్సవ వేడుకలు అనంతపురం జిల్లా కనేకల్ మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను కనేకల్ మండల కార్యదర్శి ఎం. గౌస్ పీర్ ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ అనంతరం గౌస్ పీర్ మాట్లాడుతూ, 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించబడిందని గుర్తు చేశారు. బ్రిటిష్ వలస పాలనలో భారతదేశ సంపదను తెల్లదొరలు దోచుకుని విదేశాలకు తరలిస్తున్న సమయంలో, బానిసత్వంలో నలిగిపోయిన కార్మికులు, రైతులు, బడుగు%-%బలహీన వర్గాలకు నాయకత్వం అందించిన పార్టీ సీపీఐ అని పేర్కొన్నారు. ఎర్రజెండా నాయకత్వంలో కమ్యూనిస్టు నేతలు అనేక పోరాటాలు చేసి, ప్రాణత్యాగాలు చేసి దేశ స్వాతంత్ర్య సాధనలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం కూడా సీపీఐ పార్టీ రైతులు, వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, నిరుపేదల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ వస్తోందని అన్నారు. ఈ పోరాటాల ప్రభావంతో కొత్తపల్లి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు సీపీఐ పార్టీలో చేరి పార్టీ సిద్ధాంతాలను స్వీకరించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి ముల్ల శర్మాస్ వలి, ఎస్. బషీర్ అహ్మద్, ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి జే. దాదా పీర్, మండల అధ్యక్షుడు ఎస్. హెచ్. షఫీ, ఆల్ ఇండియా తంజిమ్-ఎ-ఇన్సాఫ్ కమిటీ నాయకులు కాక్డి జిలాన్ ,నూర్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ శాఖల కార్యదర్శులు, మహిళా సంఘ నాయకులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేశారు.

# బాలల ఆరోగ్యమే లక్ష్యంగా ఆర్బీఎస్కే సేవలు

## - డీఎంహెచ్‌వో డా. ఈ.బి. దేవి

**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం, డిసెంబర్26:** జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్కే) ద్వారా ఉచిత వైద్య పరీక్షలు, చికిత్సలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. ఈ.బి. దేవి తెలిపారు. డీఎంహెచ్‌వో డా. ఈ.బి. దేవి ఆధ్వర్యంలో ఆర్బీఎస్కే ఇన్‌ఛార్జ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ (ఎన్‌సీడీ) డా. విష్ణుమూర్తి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జిల్లావ్యాప్తంగా సమర్థవంతంగా అమలవుతోందని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 2,302 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలోని 2,04,206 మంది పిల్లలకు గాను 1,86,884 మంది పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే జిల్లాలోని 1,741 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 2,36,763 మంది విద్యార్థులకు గాను 1,56,836 మంది విద్యార్థులకు ఆరోగ్య స్క్రీనింగ్ పూర్తయ్యిందని వెల్లడించారు. ఏఎన్‌ఎంలు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎంఎలహెచ్‌పీలు), వైద్య సిబ్బంది అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, భవిత కేంద్రాల్లో విద్యార్థుల వద్దకే వెళ్లి



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పుట్టుకతో వచ్చే లోపాలు, బాల్యంలో వచ్చే వ్యాధులు, పోషకాహార లోపాలు, ఎదుగుదల లోపాలు (4డీలు) కలిపి ఇప్పటి వరకు మొత్తం 1,257 కేసులను గుర్తించామని డా. ఈ.బి. దేవి తెలిపారు. గుర్తించిన పిల్లలందరినీ స్క్రీనింగ్ అనంతరం ఆర్బీఎస్కే -డీఈఐసీ ఓపీ నంబర్ 99 ద్వారా నమోదు చేసి, అవసరమైన వారికి సంపూర్ణంగా చికిత్సలు అందిస్తున్నామని పేర్కొన్నారు. పుట్టుకతో వచ్చే లోపాల కారణంగా శస్త్రచికిత్స అవసరమైన పిల్లలకు ఎన్‌టీఆర్ విద్యాసేవ పథకం ద్వారా పూర్తిగా ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించామని తెలిపారు. ఈ విధంగా పిల్లల కుటుంబాలపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం పూర్తి వైద్య సహాయం అందిస్తోందన్నారు. అలాగే ఆర్బీఎస్కే చైల్డ్ ట్రాన్స్‌పోర్ట్ వాహన సేవల ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి పిల్లలను డీఈఐసీ కేంద్రానికి సురక్షితంగా తీసుకువచ్చి, చికిత్స పూర్తైన అనంతరం వారివారి గ్రామాలకు ఉచితంగా తిరిగి చేరవేయడం జరుగుతోందని వివరించారు. ఈ రవాణా సౌకర్యం వల్ల తల్లిదండ్రులకు ఎలాంటి ఖర్చు లేకుండా పిల్లలకు నిరంతర వైద్య సేవలు అందుతున్నాయన్నారు. స్క్రీనింగ్‌లో ఆరోగ్య సమస్యలు ఉన్న పిల్లలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం (డీఈఐసీ) ద్వారా నిరంతర పర్యవేక్షణలో ఉంచి చికిత్సలు కొనసాగిస్తున్నామని తెలిపారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రుల అప్రమత్తత ఎంతో కీలకమని డా. ఈ.బి. దేవి తెలిపారు. ఆర్బీఎస్కే బృందం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రతి ఒక్కరూ పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# అనంతపురంలో అమ్మకానికి తుపాకులు....!

- నాటు తుపాకులు విక్రయించే మధ్యప్రదేశ్ కు చెందిన ముఠా అరెస్ట్
- 5 తుపాకులు, 7 మ్యాగజైన్లు, ఒక తల్వార్ స్వాధీనం




**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** అనంతపురంలో తుపాకుల సరఫరా చేస్తున్న మధ్యప్రదేశ్ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. భార్యను తుపాకీతో బెదిరించిన కేసు దర్యాప్తులో భాగంగా ఈ ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. భర్త తుపాకీతో బెదిరించడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు భార్య ఫిర్యాదు మేరకు జిమ్ ఓనర్ అయిన రాజశేఖర్ ను విచారించారు. కాగా అతను తుపాకీ పొందిన తీరును నిందితుడు వెల్లడించాడు. అనంతపురం ఎస్పీ పి.జగదీశ్ కూపీ లాగడంతో మధ్యప్రదేశ్ ముఠా గన్స్ విక్రయించినట్లు తెలిసింది. దీంతో దర్యాప్తును ముమ్మరం చేసిన అనంతపురం పోలీసులు మధ్యప్రదేశ్ ముఠాలో నలుగురిని స్థానికంగా, మరో ఇద్దరిని మధ్యప్రదేశ్ లో అరెస్టు చేశారు. అయితే చివరి నిమిషంలో గన్స్ సరఫరా చేసే ముఠాలోని కీలక వ్యక్తులు తప్పించుకున్నారు. వారి కోసం గాలించిన పోలీసులు ఎట్టకేలకు నిందితులను పట్టుకోవడంతో కేసు కీలక మలుపు తిరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ముఠాలో కీలకమైన ముగ్గురు సభ్యులను అనంతపురం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 5 కంట్రిమేడ్ రివాల్వర్లు, 30 బుల్లెట్లు, ఒక కాళీ మ్యాగజైన్, ఒక తల్వార్ ను స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్ కు చెందిన ముఠాగా వారిని గుర్తించారు. ఈ మేరకు నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు.

**జిల్లా ఎస్పీ హెచ్చరిక :**
జన సంచార ప్రదేశాల్లో అక్రమ ఆయుధాల కలిగి ఉండటం మరియు వినియోగించడం తీవ్రమైన నేరమని... ఇటువంటి ఘటనలను ఏ మాత్రం సహించబోమని, నేరస్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. అక్రమంగా తుపాకులు విక్రయించటం వల్ల నేరాలు పెరిగే ప్రమాదం ఉండటంతో పాటు, ప్రజల ప్రాణాలకు తీవ్ర ముప్పు ఏర్పడుతుందని, ఇటువంటి ముఠాలపై నిరంతర నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా అక్రమ ఆయుధాల సరఫరా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి నిఘా చర్యలు కొనసాగుతాయని తెలిపారు

**జిల్లా ఎస్పీ పి. జగదీష్ ప్రశంస**
5 కంట్రిమేడ్ ఫిస్టోళ్లు, 30 బుల్లెట్స్, 3 ఖాళీ బుల్లెట్ షెల్స్ , 07 మ్యాగ్జైన్లు, తల్వార్ లను స్వాధీనపరుచుకోవడంలో విశేష కనపరిచిన కనబరిచిన పోలీసు అధికారులను మరియు పోలీసు బృందాలను జిల్లా ఎస్పీ పి.జగదీష్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతపురము అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాస రావు మరియు అనంతపురము 2 టౌన్, 3 టౌన్ సి.ఐ లు శ్రీకాంత్ , రాజేంద్రనాథ్ యాదవ్, సి సి ఎస్ సి ఐ శేషగిరి, బొమ్మనహల్ ఎస్సై, ఎస్ .నబీ రసూల్ అనంతపురము 2 టౌన్ పిఎస్ ఎస్సై . ఋ షేంద్ర బాబు, అనంతపురము 2 టౌన్ సిబ్బంది ఏ ఎస్ ఐ అమరేశ్వర్, కానిస్టేబుళ్ళు వన్నూరప్ప, అంజన కుమార్, సుధాకర్, పాండవ, తదితర సిబ్బంది ఉన్నారు.










# మల్లెల ఇమాంబి దర్గాను దర్శించుకున్న రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్



**తొండూరు -సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** తొండూరు మండలం మల్లెల గ్రామంలోని మల్లెల ఇమాంబి దర్గాను రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా, కడప జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అక్కులుగారి. విజయ్ కుమార్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా దర్గా నిర్వాహకులు, మహబూబ్ బాషా, విజయ్ కుమార్ రెడ్డి లకు తొండురు మండల తెదేపా నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఇరువురికి పూలమాల మరియు దుశ్శాలువాతో సత్కరించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం జరిగింది. అనంతరం దర్గాలో ఉన్న వాక్ఫ్ బోర్డు కార్యాలయం నందు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. సమావేశంలో మహబూబ్ భాషా మాట్లాడుతూ మల్లెల గ్రామంలో అత్యధిక ముస్లింలు ఉన్నారని వారికి వచ్చే 2027 సంవత్సరపు హజ్ యాత్ర గురించి వివరించడం జరిగింది. దర్గా కమిటీ సభ్యులు మరియు గ్రామ తెదేపా నాయకులకు మహబూబ్ భాషా, విజయ్ కుమార్ ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. రెడ్డి. ఈకార్యక్రమంలో దర్గా కమిటీ ప్రెసిడెంట్ మహమ్మద్, సెక్రెటరీ గౌస్ మొద్దీన్, మల్లెల మాజి సర్పంచులు నాగిరెడ్డి, గంగులయ్య, సింగల్ విండో సూర్య నారాయణ రెడ్డి, పులివెందుల మైనార్టీ నాయకులు షేక్. సమద్, సయ్యద్. ఉమర్,షేక్. అక్రమ్, బాబా ఫకృద్దీన్, మాబాషా, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రం పరిశీలన

## - రైతుల సమస్యలపై ఆర్డిఓ, ఎమ్మార్వో ఆరా



**కణేకల్ -సూర్య వాస్తవం, డిసెంబర్ 26:** కణేకల్ మండలం యర్రగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని కళ్యాణదుర్గం ఆర్డిఓ వసంత బాబు, కనేకల్ ఎమ్మార్వో బ్రహ్మయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రానికి వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియ లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని, రైతుల సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. కొనుగోలు కేంద్రంలో తూకం, గోణె సంచులు, చెల్లింపులపై వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యర్రగుంట వన్నారెడ్డి సోదరుడు వెంకటరామిరెడ్డి స్థానిక రైతులు, గ్రామ ప్రజలు,రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

# అయ్యప్ప స్వామి గ్రామోత్సవం

## - శరణ ఘోషతో మారుమోగిన పురవీధులు



**కనేకల్లు - సూర్య వాస్తవం, డిసెంబర్ 26 :** కనేకల్ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయము నందు 36వ గ్రామోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ అయ్యప్ప స్వామి వార్షికోత్సవంలో భాగంగా శ్రీ అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తిని ఉదయం 6 గంటలకు మేళ తాళాలతో శ్రీ చిక్కనేశ్వర వడియార్ చెరువు దగ్గరికి ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి వసంత ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పుణ్యాహవచనం నవగ్రహ ఆరాధన ప్రధాన కలిసే స్థాపన పంచామృత సహిత రుద్రాభిషేకం గణపతి నవగ్రహ ప్రధాన హెూమాలు పూర్ణాహుతి అన్నదానం నిర్వహించారు. అనంతరం స్వామివారిని బంగారు వ్రతంపై ప్రత్యేకంగా అలంకరించి మేళ తాళాల మధ్య విద్యుత్ దీపాలతో పట్టణ ప్రధాన వీధుల గుండా దిగువగేరి వరకు ఊరేగింపుగా వెళ్లి గ్రామం ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ గురు స్వాములు తిమ్మప్ప చిక్కన్న నాగప్ప ఆలయ అధ్యక్షులు నాగభూషణం సుబ్రహ్మణ్యం ప్రధాన కార్యదర్శిలు రాపా ప్రకాష్ సుధాకర్ కమిటీ సభ్యులు హెూటల్ శివ మల్లికార్జున వంట మాస్టర్ శివ అర్చకులు వినయ్ స్వామి మాలవేసిన స్వాములు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )